


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

మహబూబ్‌నగర్ నాగర్‌కర్నూల్ జోగులాంబగద్వాల్ నారాయణపేట వనపర్తి

బుధవారం 31 డిసెంబర్ 2025 పేజీలు 8


## వార్డుల మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**సూర్య, వనపర్తి ప్రతినిధి :** త్వరలో జరుగబోయే పురపాలికల ఎన్నికల నిర్వహణకు వార్డుల మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో పురపాలికల ఎన్నికలపై మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పురపాలికల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీస్ విడుదల చేసిందని దానికి అనుగుణంగా జనవరి 1వ తేది నాడు మున్సిపల్ వార్డు వారిగా ముసాయిదా ఎలక్టరల్‌రోల్ జాబితా విడుదల చేయాల్సి ఉంటుందని తెలియజేశారు.అసెంబ్లీ నియోజకవర్గం వారిగా ఉన్న ఎలక్టరల్ రోల్ ను పార్ట్ వారిగా ఒక్కో మున్సిపల్ వార్డులో ఎన్ని పార్టులు వస్తున్నాయి, అందుకొని ఇంటి నెంబర్లు, ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు.జనవరి ఒకటవ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితా, వార్డులో అసెంబ్లీ ఉప విభాగాల వివరాల ఆధారంగా ప్రజల నుండి వచ్చే అభ్యంతరాలను జనవరి 5 నుంచి స్వీకరించి పరిష్కరించిన, తప్పులు లేని తుది ఓటరు జాబితాను జనవరి 10వ తేదీన ప్రకటించాలని సూచించారు.జనవరి 10న ప్రకటించే తుది ఓటరు జాబితా ఆధారంగా మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు.జనవరి, 5వ తేదీన ప్రముఖ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మున్సిపల్ కమిషనర్లు సమావేశాలు నిర్వహించి వారికి వార్డుల వివరాలు తెలిపి అభ్యంతరాలను తీసుకోవాలని, జనవరి 6వ తేదీన కలెక్టర్ స్థాయిలో కలెక్టరేట్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.వార్డుల మ్యాపింగ్ తప్పులు లేకుండా పకడ్బందీగా సిద్ధం చేస్తే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చని తెలియజేశారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్లు, సి సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర ద్వారము ద్వారా వారి శ్రీ స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**గద్వాల సూర్యప్రతినిధి:** గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర్ స్వామి దేవాలయాలలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారము ద్వారా శ్రీ స్వామి వారిని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ ముక్కోటి దేవతలతో కలిసి స్వామి భూలోకానికి వచ్చే శుభ సందర్భం వైకుంఠ ఏకాదశి. పరమ పవిత్రమైన ఈ రోజున ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకుంటే జన్మజన్మల పాపాలు తొలగిపోయి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయని ముక్కోటి ఏకాదశి రోజు విష్ణుదర్శనం తర్వాత పూజచేసి ఉపవాసం ఉంటే అఖండ ఐశ్వర్యం సిద్ధిస్తుందంటారు. ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సిరిసంపదలతో, రైతులకు అన్ని రంగాల ప్రజలు అభివృద్ధి చెందే విధంగా శ్రీశ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఉండాలని మనస్ఫూర్తిగా స్వామివారిని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**గండీడ్ మేజర్‌న్యూస్:** రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాఫెడ్ సంస్థ ద్వారా సెర్ఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రంలో క్వింటాల్ కు 8 వేల రూపాయల మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేశారన్నారు. రైతు భరోసా ఎకరానికి 6000 చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు.రెండో పంటకు రావాల్సిన రైతు భరోసాను త్వరలోనే విడుదల చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి, డిపిఎం అరుణ, సూపరిండెంట్ హరిచంద్ర రెడ్డి,ఏపీఎం రజిత, మండల వ్యవసాయ అధికారి రాధమ్మ, గండీడ్ సర్పంచ్ భగవంతు రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు అనంత లక్ష్మారెడ్డి,ఆశి రెడ్డి,ఆశన్న, సర్పంచులు పాల్గొన్నారు.




## టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జి వెంకటేశ్వర్లు



**గద్వాల సూర్య ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో మంగళవారం టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా మూడవ సభలు సీనియర్ జర్నలిస్టు ఎస్ ఆశన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి డబ్ల్యూ జేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య. జోగులాంబ గద్వాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవ ఆమోదం చేయడం జరిగింది. టిడబ్ల్యూజేఎఫ్ నూతన జిల్లా అధ్యక్షుడు జి వెంకటేశ్వర్లు, కార్యదర్శి డి వెంకటన్న, కోశాధికారి రాముడు, ఉపాధ్యక్షులు కె వీరన్నాచారి, రాముడు, తిరుమలేష్, సహాయ కార్యదర్శిలు బుచ్చన్న, శాంతిరాజు, ఆశన్న, రాఘవ గౌడ్, ఈసీ సభ్యులు వెంకట్ రాములు ఆంజనేయులు మద్దిలేటి వెంకటేశ్వర్లు సుధాకర్ లవకుశ అనిల్, టి రామ్మోహన్ రెడ్డి ఎంపికయ్యారు.

## నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి- ఎస్సై నాగరాజు



**సూర్య మేజర్ /న్యూస్:** చిన్నంబావి మండలంలోని గ్రామాలలో నూతన సంవత్సర వేడుకలు శాంతి భద్రతలు భంగం కలిగకుండా వేడుకలు నిర్వహించాలని ఎస్ ఐ నాగరాజు కోరారు. అయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంతం గా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.నిబంధన లు అతిక్ర మించి ఎక్కువ చేస్తే వారిపై చట్ట ప్రకారం మైన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్ మద్యం సేవించి ఆహనాన్ని నడిపితే వాహనం సీజ్ వాటితో పాటు భారీ జరిమాణం, మరియు, కేసునమోదు చేయబడుతుందని డీజే నిషేధం శబ్ద, కాలుష్యం .కలగజేసి,%ణయి% అధికంగా, శబ్దంతో, మ్యూజిక్, సిస్ట, అనుమతిలేదన్నారు. అసభ్యప్రవర్తన, రహదారూపై గుంపులు గుంపులు కనబడితే కఠిన చర్యలు తప్పవని అయన పేర్కొన్నారు.

## వీధి కుక్కలు, కోతుల బెడదను అరికట్టాలి : బీజేపీ నాయకులు



**ఐజ సూర్య న్యూస్ :** అయిజ పట్టణంలో వీధి కుక్కల బెడద మరియు కోతుల స్వైరవిహారం వల్ల ప్రజల ప్రాణ భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడిందని, వీటిని అరికట్టడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్ రెడ్డి విమర్శించారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ అశోక్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భగత్ రెడ్డి మాట్లాడుతూ, పట్టణంలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, దీనివల్ల ముఖ్యంగా చిన్నారులు భయాందోళనల మధ్య జీవించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరేళ్ల సుబ్బారాయుడు అనే బాలుడు కుక్క కాటుకు గురై తీవ్రంగా గాయపడటం, పరిస్థితి విషమించడంతో గద్వాలకు తరలించాల్సి రావడం పట్టణ ప్రజలను కలచివేసిందని అన్నారు. ఇది కేవలం ఒక్క సంఘటన మాత్రమే కాదని, తరచూ ఇలాంటి దాడులు జరుగుతున్నా మున్సిపాలిటీ నుంచి సరైన స్పందన కరువైందని ఆయన మండిపడ్డారు. అదేవిధంగా పట్టణంలోని 3వ వార్డు ఎస్సీ కాలనీ పరిధిలో ఐదేళ్ల చిన్నారిపై కోతులు దాడి చేసిన ఘటన అధికారుల వైఫల్యానికి నిదర్శనమని భగత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ కోతుల బెడదపై శాశ్వత చర్యలు తీసుకోకపోవడం అత్యంత ఆందోళనకరమని విమర్శించారు. అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని, శాస్త్రీయ పద్ధతిలో కోతులను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ తక్షణమే స్పందించి కుక్కల నియంత్రణకు శాశ్వత కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రభుత్వం మరియు మున్సిపాలిటీ తన బాధ్యతను విస్మరిస్తే, ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు బెల్లంకొండ నాగరాజు, నాయకులు చిన్న శంకరయ్య, అంజి, లక్ష్మణాచారి, వెంకటేష్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తుది దశకి చేరుకున్న ధాన్యం కొనుగోళ్లు

**మహబూబ్ నగర్, సూర్య ప్రతినిధి:** ధాన్యం సేకరణ వేగవంతం చేసి పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఖరీఫ్ 2025%-%26 ధాన్యం సేకరణపై మంగళవారం పౌర సరఫరాల శాఖ అధికారులతో రెవిన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, మొత్తం సేకరణ ప్రక్రియను అత్యంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లర్ల నుండి పొందిన బ్యాంక్ గ్యారంటీలను పరిశీలించగా, మిల్లర్లకు అందజేసిన పాడికి సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ గ్యారంటీలను మూడు (03) రోజుల్లో ఖచ్చితంగా సేకరించాలని సంబంధిత పౌర సరఫరాల శాఖ డి.టి.లను ఆదేశించారు. అదేవిధంగా రబీ 2024%-%25 సీజన్‌కు సంబంధించిన సి. ఎం.ఆర్ డెలివరీ పై సమీక్ష నిర్వహించారు. మిల్లింగ్ సామర్థ్యానికి అనుగుణంగా మిల్లులను రెండు (02) షిఫ్టుల్లో నిర్వహిస్తూ సి. ఎం.ఆర్ డెలివరీ లను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. డిసెంబర్ 29 నాటికి జిల్లాలో 26,015 మంది రైతుల నుంచి మొత్తం 1,30,459 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. మొత్తం ?312 కోట్ల మద్దతు ధర కు గాను, 24,072 మంది రైతులకు ?295 కోట్లు చెల్లించగా, మిగిలిన ?17 కోట్లు రెండు (02) రోజుల్లో విడుదల చేయబడతాయని అధికారులు వివరించారు. బోనస్ మొత్తానికి సంబంధించి, మొత్తం 36.24 కోట్ల రూ.లకు గాను, 7,971 మంది రైతులకు 21.95 కోట్లు రూ.లు చెల్లించబడినట్లు తెలిపారు. మిగిలిన 14.29 కోట్ల రూ.లు ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుండగా, అందుకు సంబంధించిన అన్ని వివరాలు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేయబడినట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణ ,సి.ఎం.ఆర్ డెలివరీ ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.సమావేశం లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్,పౌర సరఫరాల శాఖ డి.ఎం. రవి నాయక్,పౌర సరఫరాల డి.టి.లు పాల్గొన్నారు.

# మూతపడ్డ స్టడీ సర్కిళ్లను తెరిపించాలి

**- దళిత విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం పట్ల మంత్రులు స్పందించాలి**

**- కెపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు**






**పాలమూరు సూర్య న్యూస్:** రాష్ట్రంలో మూతపడ్డ ఎస్సీ స్టడీ సర్కిల్లను తక్షణమే తెరిపించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. ఎస్సీ స్టడీ సర్కిళ్లను వెంటనే ప్రారంభించి దళిత విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూకెవిపిఎస్ మహబూబ్ నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో 12 ఎస్ సి స్టడీ సర్కిల్లు గత 16 నెల్లుగా మూతపడడం వల్ల గ్రూప్స్ సివిల్స్ పోటీలకు తగిన శిక్షణ లేక దళిత విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్టడీ సర్కిల్ ల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగ అవకాశాల కోసం పోటీ పడాలనుకునే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ స్టడీ సర్కిల్ మూసివేత వల్ల స్టడీ మెటీరియల్, శిక్షణ,వసతి వంటి సదుపాయాలు లేక పోటీ పరీక్షలకు సిద్ధం కాలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ స్టడీ సర్కిల్ కొనసాగుతున్నప్పటికీ, ఎస్సీ స్టడీ సర్కిల్స్ మూసివేయడం దళితుల పట్ల వివక్ష ప్రదర్శించడమేనని విమర్శించారు. ఇప్పటికైనా దళిత మంత్రులు స్పందించి ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చించి బడ్జెట్ కేటాయించాలని, స్టడీ సర్కిలు ప్రారంభించాలని లేదంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కే యూపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కురుమయ్య, ఉపాధ్యక్షులు లక్ష్మీదేవి, పట్టణ కార్యదర్శి ఆది విష్ణువర్ధన్,నాయకులు వెంకటరాములు, మనోహర్, నాగరాజు, శంకర్, ప్రసాదు, మొగులయ్య పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు



**కోస్గి సూర్య న్యూస్:** ఆయిలు ఫామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని మండల విస్తరణ అధికారులు వినోద్ కుమార్,జనార్ధన్ లు అన్నారు.మంగళవారం ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ,తెలంగాణ అయిల్ ఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో కోస్గి వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఆయిల్ ఫామ్ సాగు వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీలు, సాంకేతిక అంశాలపై సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. దేశంలో ఫామ్ ఆయిల్ అవసరాల కోసం విదేశీ దిగుమతులపై భారీగా వ్యయం జరుగుతున్న నేపథ్యంలో దానిని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని తెలిపారు. ఆయిల్ ఫామ్ ఒక దీర్ఘకాలిక, అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటగా రైతులకు మంచి భవిష్యత్‌ను అందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు ఎకరాకు అధిక శాతం సబ్సిడీ, అంతర పంటలు, నిర్వహణ ఖర్చుల కోసం సంవత్సరానికి ?4,200 వరకు నాలుగు సంవత్సరాల పాటు రైతు బ్యాంకు ఖాతాకు నేరుగా అందిస్తున్నట్లు వారు వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే అవకాశమున్న ఈ పంటపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం అసిస్టెంట్ రిజిస్టర్ రాంగోపాల్, మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న సదుపాయాలు, రుణాలు, సాంకేతిక సహకారం గురించి వివరించారు.అదే విధంగా ఆయిల్ ఫామ్ సాగులో రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనప్పటికీ సంబంధిత అధికారులు వెంటనే పరిష్కారం లభించే విధంగా అధికారులు స్పందిస్తారని భరోసా ఇచ్చారు. ఆయిల్ ఫామ్ క్షేత్రస్థాయి అధికారిణి లు కేఎస్ శ్వేత, నవిత లు రైతులకు ఆయిల్ ఫామ్ సాగు విధానం, నాటే దశ నుండి దిగుబడి వచ్చే వరకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, నీటి వినియోగం, పోషకాలు, రోగాల నివారణ వంటి అంశాలపై స్పష్టమైన సమాచారం అందించారు. ఇప్పటికే ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులు తమ అనుభవాలను పంచుకొని, ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి : పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**మహమ్మదాబాద్. సూర్య న్యూస్:** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు.మంగళవారం నాడు మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు నిర్వహించిన ఏపిఎం నిర్మల రెడ్డి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి. ఇందిరా మహిళా శక్తి మదర్ యూనిట్ లో భాగంగా మహమ్మదాబాద్ పూజ మహిళా సంఘం (4) సభ్యురాలు సి లక్ష్మికి 3లక్షల రూపాయల పెరటి కోళ్ల పెంపకం యూనిట్ మంజూర అయింది. అలాగే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహమ్మదాబాద్ గ్రామ మహిళా సంఘం(5) సభ్యురాలుకు రెండు లక్షల రూపాయలు నంచర్ల గ్రామ ఐక్య మహిళా సంఘం (3) సభ్యురాలు కు 2 లక్షల రూపాయలు విలువగల గొర్రె పొట్టేళ్ల పిల్లల పెంపకం యూనిట్ మంజూరు కాగా ఈ యూనిట్స్ ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ సంఘటితంగా ఏకమై స్వయం ఉపాధి చెందుతూ అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ కమతం విష్ణువర్ధన్ రెడ్డి. మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా.వివిధ గ్రామాల సర్పంచులు రాంలాల్. రాజశేఖర్.లక్ష్మీ మోహన్. మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్ రెడ్డి. రాజకీయ నాయకులు మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మూడవ వార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు
### మూడవ వాడు కొమ్ము శీను



**తెలకపల్లి సూర్య న్యూస్ :** తెలకపల్లిమండల కేంద్రం మూడో వార్డులో సమస్యల పరిష్కారానికి వార్డు సభ్యుడు కొమ్ము శ్రీను చర్యలు చేపట్టారు ఇప్పటికే వార్డులో పారిశుధ్యం చర్యలు తీసుకున్నారు, అదేవిధంగా ఇనుప విద్యుత్ స్తంభాలు పరిశీలించారు తుప్పు పట్టి దెబ్బతిన్న ఇనుప స్తంభాల స్థానంలో త్వరలోనే కొత్తగా సిమెంటు పోల్స్ నాటించి వీధిదీపాలను వెలిగిస్తానని వాడు సభ్యుడు కొమ్ము శ్రీను తెలిపారు, విద్యుత్ సిబ్బంది, వాడు ప్రజలు పాల్గొన్నారు.

## తిరుమలాపూర్‌లో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం
### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి



**పెద్దకొత్తపల్లి, సూర్య న్యూస్:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమలాపూర్ గ్రామ సర్పంచ్ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిరుమలాపూర్ గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలపై స్వామివారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఆయనతో పాటు భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు గణేష్ రావు, మాజీ జెడ్పిటిసి సింగారం వెంకటయ్య, సింగిల్ విండో చైర్మెన్ కట్ట రాజేందర్ గౌడ్, సాతాపూర్ గ్రామ సర్పంచ్ కట్ట వంశీ గౌడ్, కొల్లాపూర్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుజ్జుల పరమేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి ఆశీర్వాదనాలు అందించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఆలయం భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## అనంత పద్మనాభ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన
### బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా పల్ల అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని మిత్ర బృందంతో కలిసి మంగళవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ పద్మనాభ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

## సరిహద్దు నేరాలను సమిష్టిగా నివారిద్దాం
### బి సిఐ శివశంకర్.



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** తెలంగాణ,కర్ణాటక సరిహద్దు నేరాలను సమిష్టిగా నివారిద్దామని నారాయణపేట సి ఐ. శివశంకర్ అన్నారు. నారాయణపేట జిల్లా సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు లు కర్ణాటక పోలీసు అధికారులు,కొడంగల్ ,తాండూరు పోలీసు అధికారులతో కలిసి కర్ణాటక రాష్ట్రం కలబుర్గి జిల్లా చించోలి పట్టణంలో మంగళవారం సరిహద్దు నేరాల నియంత్రణ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, అక్రమ వ్యాపారాలు నివారించేం దుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించడం జరిగింది. రెండు రాష్ట్రాల పోలీస్ శాఖల మధ్య సమన్వయం పెంచుకొని, సమాచార మార్పిడిని వేగవంతం చేయడం ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవు తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ప్రజల భద్రత దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో సంయుక్త గస్తీ, వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా కొనసాగించాలని నిర్ణయించారు.

# సాతాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రం సందర్శించిన కలెక్టర్
## తూకంలో పారదర్శకత తప్పనిసరి. కలెక్టర్ ఆదేశాలు





**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్:** రైతుల పంటకు గిట్టుబాటు ధర అందించడమే లక్ష్యంగా మండల పరిధిలోని సాతాపూర్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి చేరుకున్న కలెక్టర్ అక్కడి ఏర్పాట్లు, రైతుల నమోదు విధానం, తూకం ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని స్వయంగా చేతబట్టి పరిశీలించి, ధాన్య నాణ్యత, తేమ శాతం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా ఆలస్యం జరగకుండా వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎంతమేర వరి ధాన్యం కొనుగోలు చేశారో, ఎంతమంది రైతులు తమ పంటను విక్రయించారో సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. తూకంలో పూర్తిస్థాయి పారదర్శకత ఉండాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా కచ్చితంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన వరి ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు రైతుల ఖాతాల్లో 48 గంటల్లో జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు సంతృప్తిగా పంట విక్రయించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో పెద్దకొత్తపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి, డీపీఎం కృష్ణయ్య, ఏపీఎం సంతోష్, కమిటీ సభ్యులు అరుణమ్మ చంద్రకళ, సీసీ బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- పెద్దకొత్తపల్లిలో బుడగ జంగాల సంఘ జెండా ఆవిష్కరణ**
**- ముఖ్యఅతిథిగా హాజరైన మాల మహానాడు జిల్లా నాయకులు తగిలి వెంకటస్వామి**



**పెద్దకొత్తపల్లి, సూర్య న్యూస్ :** తెలంగాణ బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి సంఘం 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దకొత్తపల్లి మండలంలో బుడగ జంగాల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుడగ జంగాల సంఘం మండల గౌరవ సలహాదారుడు గడ్డం శివలింగం చేతుల మీదుగా సంఘ జెండాను ఆవిష్కరించి ఎగరవేశారు. ఈ కార్యక్రమం బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గడ్డం సుభాష్ అధ్యక్షతన నిర్వహించబడింది. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని సంఘ ఐక్యతను, హక్కుల సాధనలో సమిష్టి పోరాట అవసరాన్ని చాటి చెప్పారు. ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరశురాముడు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తగిలి వెంకటస్వామి, బుడగ జంగాల సంఘం మండల కోశాధికారి గడ్డం కుమార్, జిల్లా నాయకులు గడ్డం నరహరి, అంబేద్కర్ జాతర కమిటీ అధ్యక్షుడు గడ్డం యాదగిరి, తాలూకా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేష్, జగన్నాధపురం నూతన వార్డ్ మెంబర్ దూపం రాములు, మండల నాయకులు గడ్డం నరసింహ, అజయ్ కుమార్, ఓంకార్ శేఖర్ పాల్గొన్నారు. సంప్రదాయ డప్పు కళాకారులు తుపాకుల వెంకటేష్, లక్ష్మయ్యల డప్పు నాదాలతో కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బేడ బుడగ జంగం వర్గాల హక్కుల సాధనకు సంఘం నిరంతరం పోరాడుతుందని, యువత ఈ ఉద్యమంలో ముందుండాలని పిలుపునిచ్చారు.

## నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఐజ ఎస్ఐ




**ఐజ సూర్య న్యూస్ :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అయిజ పోలీస్ శాఖ కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ఈ వేడుకలను శాంతియుత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని అయిజ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత వేడుకల పేరుతో అతిగా ప్రవర్తించవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) నేరమని, అటువంటి వారి వాహనాలను సీజ్ చేయడమే కాకుండా భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. రోడ్లపై బైక్ రేసింగ్‌లు చేయడం, సైలెన్సర్లు తొలగించి అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బంది పెట్టడం వంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాలైన రోడ్లు, పార్కులు మరియు కూడళ్లలో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేయడం లేదా అధిక శబ్దంతో మ్యూజిక్ సిస్టమ్‌లు వాడటం నిషిద్ధమని ఎస్ఐ తెలిపారు. ఏదైనా ఈవెంట్ లేదా పార్టీ నిర్వహించాలనుకునే వారు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చర్యలు ఉంటాయని, ప్రతి వాహనదారుడు హెల్మెట్ మరియు సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరి అని గుర్తు చేశారు. వీటితో పాటు, న్యూ ఇయర్ ఆఫర్ల పేరుతో వచ్చే సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్, ఫేక్ లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారిపై, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ప్రజల క్షేమమే పోలీసుల బాధ్యత అని, వేడుకలను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని కోరుతూ, ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ శ్రీనివాసరావు వెల్లడించారు.

## విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..



**కోస్గి సూర్య న్యూస్:** విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య లు తెలిపారు. మంగళవారం గుండుమల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ పెట్ జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. సైబర్ నేరాలకు గురైన వ్యక్తులు1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పాఠశాల,కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్,ఈవ్ టీజింగ్ కి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విద్యార్థులు ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే షి టీమ్ పోలీసులకు 8712670398 కి లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి ఆకతాయిల ఆట కట్టించి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని పోలీసులు సూచించారు. అలాగే విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని సెల్ ఫోన్ ఉపయోగించడం వల్ల సమయం వృధా తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. సెల్ ఫోన్లో తమ ఫోటోలను అప్లోడ్ చేస్తే వాటిని అదునుగా చూసుకుని సైబర్ నేరగాళ్లు డిపి లను అశ్లీలంగా తయారు చేసి మోసం చేస్తారని కావున అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులు ప్రతిరోజు క్రీడలు ఆడాలని క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటమే కాకుండా చదువుపై దృష్టి సారించగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య,జ్యోతి,కవిత ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లింగాల సర్పంచ్ ఈశ్వరమ్మ వెంకటయ్య



**లింగాల, సూర్య న్యూస్:** మంచినీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం లక్ష్యం దిశగా చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య అన్నారు. మంగళవారం గ్రామంలోని వివిధ వార్డులను సందర్శించి ఇంటింటికి కుళాయి ద్వారా మంచినీటి సరఫరా గూర్చి కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత నీటి వనరులు, ప్రత్యేక పైప్లైన్ ద్వారా నీటి సరఫరా విధానం గూర్చి పంచాయతీ నీటి విభాగం సిబ్బంది, వార్డు సభ్యుల ద్వారా వివరాలను సేకరించారు.ఇంటింటికి కుళాయి ద్వారా త్రాగు నీటిని అందించుటకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి చర్చించారు. మంచినీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు కాలనీ వాసులకు భరోసా కల్పించారు. అప్పటికప్పుడు 10 వార్డులో దగ్గరుండి పైపు లైన్ పనులను బాగుచేయించి మంచినీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంచినీటి సరఫరా పైప్ లైన్ లీకేజీల నివారణ, గ్రేట్ వాల్ ల సమస్య తలెత్తకుండ, తాగు నీరు కలుషితం కాకుండా చూస్తూ నీటి సారఫరాలో నిర్లక్ష్యం వహించకుండా భాద్యతాయుతంగా పని చేయాలని పంచాయతీ నీటి విభాగం సిబ్బందిని ఆదేశించారు. భవిష్యత్తులో మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికబద్దంగా కృషి చేస్తూ ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నట్లు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అందులో భాగంగా గ్రామంలో ప్రజల సౌకర్యార్థం గుర్తించిన చోట మూడు చోట్ల బోర్ వెల్ వేయించి నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు సభ్యులు నేనావత్ వెంకట్, జెసిబి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ విష సంస్కృతిని విడనాడుదాం - స్వదేశీ సంస్కృతిని కాపాడుదాం

**నారాయణపేట టౌన్ సూర్య న్యూస్ :** జనవరి1 పేరుతో విదేశీ సంస్కృతినీ విడనాడి స్వదేశీ సంస్కృతిని కాపాడుకుందాం అని వీ ఎచ్ పి జిల్లా అధ్యక్షులు బందిగి సురేఖ రాంబాబు,జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్ ,పట్టణ అధ్యక్షుడు మురళీ భత్తడ్ ,కార్యదర్శి ప్రవీణ్ కడుడాస్ ఒక ప్రకటనలో కోరారు.నూతన సంవత్సరం అంటూ తాగి మన ఆరోగ్యా న్ని నాశనం చేసు కొని రోడ్లపై తిరుగుతూ ప్రాణాల మీదకు తెచ్చుకోకండని విజ్ఞప్తి చేశారు.విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సనాతన ధర్మం లో ఉగాది కొత్త సంవత్సరం అని జనవరి 1 కాదని అన్నారు.దీనినితాగుబోతుల దినోత్సవాలు అని అన్నారు.మనకుకేవలం తేదీ మాత్రమే మారుతుందని ప్రకృతిలో ఎటువంటి మార్పు ఉండదనీ పేర్కొన్నారు. మందు తాగి చిందుల వేయ డం తప్ప ఇంకేం ఉండదన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడు కుందాం అంటూ విశ్వహిందూ పరిషత్ నాయకులు పిలుపు నిచ్చారు.

## పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి.
### - డి ఈ ఓ ప్రవీణ్ కుమార్



**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** జిల్లా లోని అన్ని మండలాల విద్యాధికారులకు , ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం డైట్ కళాశాల మీటింగ్ హాల్ లో పాఠశాలలలో అమలవుతున్న అన్ని కార్యక్రమల అమలు పై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ,జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలల్లో అన్ని కార్యక్రమాలు వంద శాతం అమలు చేయాలని ఆదేశించారు.ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కాదు అంతకు మించి ప్రభుత్వ పాఠశాలలు వుండాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల లో కూడా అన్ని మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూసుకోవాలని, పదో తరగతిలో 100% ఫలితాలు సాధించాలని, సిలబస్ పూర్తి చేయాలని, పాఠశాలలకు సంబంధించిన పెండింగ్లో ఉన్న సమాచారాన్ని ఆన్లైన్ లో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఎఏంఓ దుంకుడు శ్రీనివాస్ , సీఎంఓ సుధాకర్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ ప్రశాంత్, జిసిడివో అశ్రాఖాద్రి, అన్ని మండలాల విద్యాధికారులు ,అన్నీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# చెంచు మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**- చెంచుగిరిజనుల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం చేయుత**
**- చెంచు మహిళా సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్ రాజు**



**లింగాల, సూర్య న్యూస్:** చెంచు గిరిజనులకు జీవనోపాదులు కల్పించి ఆర్థిక పరిపుష్టి సాధించే విధంగా ప్రభుత్వం ఇస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుంటూ చెంచు గిరిజన మహిళలు మహిళలు ఆర్థిక స్వలాంభన సాధించే విధంగా చెంచు స్వయం సహాయక సంఘాలు ఒక్కరు కృషి చేయాలని చెంచు మహిళా సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్ రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన లింగాలోని చెంచు మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చెంచు గిరిజన రైతులు పంట ఉత్పత్తులను నిలువ చేసుకునేందుకు 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన గోదాం నిర్మాణం నిమిత్తం స్థల పరిశీలనను జిల్లా డిపిఎం బాషా నాయక్ చేశారని వెల్లడించారు. నాగరిక జీవనానికి దూరంగా అడవుల్లో జీవనం సాగించే చెంచు మహిళలు పొదుపు సంఘాల్లో భాగస్వాములను చేసి ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే విధంగా చెంచు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చెంచు సహాయక సంఘాలను చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. చెంచు మహిళలు పొదుపు సంఘాలను బలోపేతం చేసి ఆర్థిక పరిపుష్టి సాధించాలని అన్నారు. చెంచు మహిళా సంఘాలకు ప్రభుత్వం చేయూత అందిస్తూ ఇస్తున్న రుణాలను సద్వినియోగపర్చుకోని తమ కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకొని వెళ్లాలని సూచించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే కొత్త వారికి రుణాలు ఇచ్చేందుకు అవకాశం కలుగుతుందన్నారు. పొదుపు చేసుకుని తమ జీవితాన్ని సుఖమయం చేసుకోవాలని కోరారు. స్వయం సహాయక సంఘాల్లో ప్రతీ నెల పొదుపులు, అప్పులు, బ్యాంకు రుణాలు, శ్రీనిధి అప్పులు తీసుకుని ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు ఎలా నిర్వహించు కోవాలన్న అంశాలపై మహిళా సంఘాల సభ్యులు ప్రతినెల సమావేశమై క్లుప్తంగా చర్చించుకొని సంఘాలు పటిష్టపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెంచు మహిళా సమాఖ్య అకౌంటెంట్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి వేళ బి ఆర్ ఎస్ నాయకుల తొ ఆధ్యాత్మిక శోభ.

**- మాజీ ఎమ్మెల్యేను కలిసిన సాతాపూర్ నాయకులు.**

**పెద్దకొత్తపల్లి, సూర్య న్యూస్:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవుని తిర్మలాపూర్‌లోని శ్రీ శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం అనంతరం సాతాపూర్ గ్రామానికి చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సాతాపూర్ గ్రామ సర్పంచ్ కట్ట వంశీ గౌడ్, కొత్తపేట పీఏసీఎస్ చైర్మెన్ కట్ట రాజేందర్ గౌడ్, కొల్లాపూర్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుజ్జుల పరమేష్లు కలిసి మాజీ ఎమ్మెల్యేకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తర ద్వార దర్శనంతో కలిగిన ఆనందాన్ని పరస్పరం పంచుకుంటూ ఆధ్యాత్మిక వాతావరణంలో స్నేహపూర్వకంగా ముచ్చటించారు.ఈ భేటీలో గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమం, సహకార సంఘాల బలోపేతం వంటి అంశాలపై సానుకూలంగా చర్చించినట్లు సమాచారం. ప్రజల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు.ఆలయ అర్చకుల



ఆశీర్వాదాలతో పాటు భక్తుల సందడి మధ్య ఈ కార్యక్రమం శాంతియుతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉజ్వలంగా మార్చారు.

# ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహణ




**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** జడ్.పి.హెచ్.ఎస్ తాటికొండలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' లో భాగంగా మంగళవారం వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం (డ్రాయింగ్) పోటీలు నిర్వహించగా, దాదాపు 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ భావం, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు వివిధ ఆకర్షణీయమైన చిత్రాలను వేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.అనంతరం హర్యానా రాష్ట్ర సంస్కృతిని పరిచయం చేయడం లక్ష్యంగా హర్యానా వంటల పోటీ నిర్వహించబడింది. ఈ పోటీలో 40 మంది విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ హర్యానా వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల హెడ్‌మాస్టర్ బాలు యాదవ్ మాట్లాడుతూ, "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం ద్వారా దేశంలోని విభిన్న రాష్ట్రాల సంస్కృతి, భాషలు, ఆహార అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని, ఇలాంటి కార్యక్రమాలు జాతీయ సమైక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని" అన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు సంస్కృతిక కార్యక్రమాల్లోనూ ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కమిటీ సభ్యులు, హిందీ ఉపాధ్యాయులు పట్నం చెన్నయ్య, గణిత ఉపాధ్యాయులు శ్రీ వెంకటేష్, తెలుగు ఉపాధ్యాయిని లక్ష్మీ స్వరూప, కంప్యూటర్ ఉపాధ్యాయులు సురేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ముక్కోటి వైకుంఠ ఏకాదశి శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో భక్తుల పూజలు





**ఉప్పునుంతల సూర్య న్యూస్ :** ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామంలో ఉన్న ఉత్తర ముఖద్వారం కలిగిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట, నాగర్‌కర్నూల్ తాలూకాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. పండుగ ప్రత్యేకతగా ఉత్తర ద్వారం గుండా భక్తులకు వైకుంఠ దర్శనం కల్పించగా, ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందంతో పులకించిపోయారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ వేముల నరసింహారావు, ఈఓ నరసింహులు, పాలకమండలి సభ్యులు చల్లమల గణేష్ గౌడ్, బుధగం శ్రీనివాసులు గౌడ్, ఎలుక స్వరూప రెడ్డి, కాన్నోజు ప్రదీప్ ప్రసాద్, చెవ్వ కృష్ణయ్య,ఉప్పునుంతల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట అనంత రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ నరసింహారెడ్డి, మామిళ్ళపల్లి సర్పంచ్ మోకురాల మోహన్ గౌడ్, ఉప్పునుంతల సర్పంచ్ చింతగల శ్రీనివాసులు, దేవదారికుంట సర్పంచ్ రతన్ సింగ్, ఎస్సై వెంకట్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు మడ్డి తిరుపతయ్య గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మేడమోని భాస్కర్ తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

# భక్తులకు ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారా దర్శనం





**పెబ్బేరు సూర్య న్యూస్ :** పెబ్బేరు మున్సిపాలిటీ లోని చెల్లిమిల పెబ్బేరు శ్రీ శ్రీ శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాలలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారా దర్శనాని భక్తిశ్రద్ధలతో భక్తులు దర్శించుకున్నారు. పెబ్బేరు లోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి వారికి అమృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ తో పూజలు స్వామివారికి పల్లకి సేవ, వైకుంఠ ద్వార దర్శనం అనంతరం స్వామి వారికి పుష్పార్చన తులశార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో హిందూ జాగృతం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, లింగాష్టకం, కాలభైరవాష్టకం లను పాటించడం అనంతరం భవద్గీత పారాయణం చేయడం జరిగింది. వక్తలచే ముక్కోటి వైకుంఠ ఏకాదశి విశిష్టతను భక్తులకు వైకుంఠ ఏకాదశి హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన ఏకాదశి. ఇది ముఖ్యంగా శ్రీ మహావిష్ణువు ఆరాధనకు అంకితం. ఈ రోజు ఉపవాసం, జపం, ధ్యానం, పూజలు చేయడం ద్వారా పాపాలు తొలగిపోతాయని, మోక్షప్రాప్తి కలుగుతుందని విశ్వాసం ఉంది. ముఖ్యంగా వైష్ణవ సంప్రదాయంలో ఈ ఏకాదశికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందనీ వివరించారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భజన కార్యక్రమాలు స్వామికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ, భూమి పరిరక్షణ సమితి సభ్యులు, షిరిడి సేవా సమితి సభ్యులు, అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులు, శివ మారుతి ఆలయ కమిటీ సభ్యులు, రామలింగేశ్వర ఆలయ సేవా సమితి సభ్యులు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక సహకార సంఘానికి ఉత్తమ అవార్డు



**తెంకపల్లి సూర్య న్యూస్ :** తెలకపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం( సింగిల్ విండో) కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రైతు సేవలో తరిస్తున్న సొసైటీల పనితీరును గుర్తించి హైదరాబాదులో సోమవారం నిర్వహించిన 2025 అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా ఉత్తమ అవార్డు తోపాటు 15 లక్షల రూపాయల గ్రాంట్ ప్రకటించి అందజేసినట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ ధర్మవీర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘం చైర్మన్ మరియు డైరెక్టర్లు పిఎసిఎస్ సిబ్బంది రైతుల సహకారం వల్లే ఈ గ్రాంట్ వచ్చిందని వారు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలో మొత్తం 8 సహకార సంఘాలకు మొత్తం రూ.15 లక్షల చొప్పున గ్రాంట్లు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. డ్యూటీ గ్రాండ్ ద్వారా పిఎసిఎస్ ఆధ్వర్యంలో వ్యాపార కార్యకలాపాలను బలోపేతం చేయడం,గోదాములు,నిల్వ సదుపాయాలు అభివృద్ధి చేయడం,రైతుల ఉత్పత్తులను సమీకరించి మంచి ధరలు ఆడించడం వంటి పనులను సమర్థవంతంగా చేయగలుగుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ సీజీఎం ఉదయకుమార్, జాయింట్ రిజిస్ట్రార్, డీసీఓ రఘునందన్ రావు, కార్యక్రమ సమన్వయ కర్త నందకిషోర్ పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి



**నవాబుపేట్ సూర్య న్యూస్:** ప్రతి ఒక్కరు చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలని తహసిల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో జరిగిన,సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు సమస్యలపై స్పందించాలన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకోవాలని,సక్రమంగా అందేలా చూడాలన్నారు.ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడంతోపాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని,నిమ్న జాతుల వారిని కించపరిస్తే చట్టప్రకారం శిక్ష పడుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతారాణి,ఉప సర్పంచ్ అజహార్ అలీ,ఆర్ఐ గాయత్రి,మాజీ ఏఎంసీ చైర్మన్ నరసింహ చారి,వార్డు సభ్యులు,ఆనంద్,సత్యం,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ వాసుని దర్శనానికి పోటెత్తిన భక్తులు







**రాజోలి సూర్య న్యూస్:** రెండో తిరుపతిగా పేరుగాంచినటువంటి జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వైకుంఠ నారాయణస్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు చుట్టుపక్కల గ్రామాల నుంచి కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా దేవదేవుని దర్శనానికి భక్తులు తరలివచ్చారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విధాల ఏర్పాట్లు చేశారు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కొరకు తీర్థ ప్రసాదాలు అల్పాహార వితరణ వంటి సౌకర్యాలు సమకూర్చారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని సుమారు 60 నుంచి 70 వేల మంది దాకా భక్తులు వచ్చే అవకాశం ఉందని ముందే ఊహించి తగిన ఏర్పాట్లు చేశామని అయినా ఒక లక్ష వరకు భక్తులు స్వామివారి దర్శనం కొరకు వచ్చి ఉంటారని ఒక అంచనా వేశారు ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు సేవ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు మరియు ఆలయ సిబ్బంది సేవలు అందించారు ఈ కార్యక్రమంలో ముఖ్యంగా శ్రీ బాలాజీ సేవా ట్రస్ట్ అభ్యర్థులు మరియు జైశ్రీరామ్ సేవా సమితి రాజోలి సభ్యులు స్వామీ వారి సేవలో పాల్గొన్నారు శ్రీ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజోలి ఎస్ఐ గోకారి పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు కూడా నిర్వహించారు ఈ కార్యక్రమంలో రాజోలి గ్రామ సర్పంచ్ సి గంగిరెడ్డి ఉప సర్పంచ్ సంధ్య శ్రీరామ్ రెడ్డి రాజోలి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పి దస్తగిరి బిజెపి రాజోలి మండల అధ్యక్షుడుశశి కుమార్ జోగులాంబ గద్వాల జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి స్వామివారి సేవకు వచ్చిన శ్రీ బాలాజీ సేవా ట్రస్ట్ వారిని కృతజ్ఞత పూర్వకంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు భక్తులు స్వామివారి సేవలో పాల్గొన్నారు.

# వీధి కుక్కలు, కోతుల బెడదను అరికట్టాలి: బీజేపీ నాయకులు



**ఐజ సూర్య న్యూస్ :** అయిజ పట్టణంలో వీధి కుక్కల బెడద మరియు కోతుల స్వైరవిహారం వల్ల ప్రజల ప్రాణ భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడిందని, వీటిని అరికట్టడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్ రెడ్డి విమర్శించారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ అశోక్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భగత్ రెడ్డి మాట్లాడుతూ, పట్టణంలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, దీనివల్ల ముఖ్యంగా చిన్నారులు భయాందోళనల మధ్య జీవించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరేళ్ల సుబ్బారాయుడు అనే బాలుడు కుక్క కాటుకు గురై తీవ్రంగా గాయపడటం, పరిస్థితి విషమించడంతో గద్వాలకు తరలించాల్సి రావడం పట్టణ ప్రజలను కలచివేసిందని అన్నారు. ఇది కేవలం ఒక్క సంఘటన మాత్రమే కాదని, తరచూ ఇలాంటి దాడులు జరుగుతున్నా మున్సిపాలిటీ నుంచి సరైన స్పందన కరువైందని ఆయన మండిపడ్డారు. అదేవిధంగా పట్టణంలోని 3వ వార్డు ఎస్సీ కాలనీ పరిధిలో ఐదేళ్ల చిన్నారిపై కోతులు దాడి చేసిన ఘటన అధికారుల వైఫల్యానికి నిదర్శనమని భగత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ కోతుల బెడదపై శాశ్వత చర్యలు తీసుకోకపోవడం అత్యంత ఆందోళనకరమని విమర్శించారు. అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని, శాస్త్రీయ పద్ధతిలో కోతులను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ తక్షణమే స్పందించి కుక్కల నియంత్రణకు శాశ్వత కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రభుత్వం మరియు మున్సిపాలిటీ తన బాధ్యతను విస్మరిస్తే, ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు బెల్లంకొండ నాగరాజు, నాయకులు చిన్న శంకరయ్య, అంజి, లక్ష్మణాచారి, వెంకటేష్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా సోమనాథ్ ఏకగ్రీవ ఎన్నిక




**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా సోమనాథ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమనాథ్ మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర మండలంలోని గూరకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయుడిగా, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు గా పనిచేస్తున్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి జారీ చేసిన నియామక ఉత్తర్వులను మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సోమనాథ్ కి అందజేశారు. ఈ సందర్భంగా గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ,రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ విద్యాశాఖలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తోందని తెలిపారు. తెలంగాణ విద్యా కమిషన్ ద్వారా కేశవరావు ఆధ్వర్యంలో తీసుకురావాల్సిన సంస్కరణల గురించి చర్చించడం జరిగిందని, పీఆర్టీయూ తెలంగాణ పక్షాన విద్యా కమిషన్ కు సూచనలు చేయడం జరిగిందని, పేద కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఆర్థిక కార్యదర్శిగా ఎన్నికైన సోమనాథ్ మాట్లాడుతూ ,ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు అలుపెరుగని పోరాటం చేస్తున్న హర్షవర్ధన్ రెడ్డి నాయకత్వంలో సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎస్ యుగంధర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యాంబాబు, భూపతి సింగ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలానా, హన్వాడ అధ్యక్ష కార్యదర్శులు పర్వతాలు, యాదయ్య గౌడ్, నవాబుపేట అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, కోశాధికారి భీమ్ రెడ్డి, మహబూబ్ నగర్ మండల అధ్యక్షుడు పాల్, బాలనగర్ మండల అధ్యక్షుడు శివానంద్, మహబూబ్ నగర్ పట్టణ అసోసియేట్ అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



**గోపాలపేట సూర్య :** గోపాలపేట మండలంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలు మంగళారనాడు అత్యంత వైభవంగా సాంప్రదాయ బద్దంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో సాంప్రదాయబద్ధంగా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర ద్వారా దర్శనం కార్యక్రమం నిర్వహించారు తెల్లవారుజామున 5 గంటలకు భక్తులు హాజరై ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు గోపాలపేట గ్రామంతో పాటు ఏదుట్ల పోలికపాడు తాడిపర్తి బుద్ధారం గ్రామాల భక్తులు పాల్గొన్నారు సర్పంచ్ కర్రోళ్ల స్వప్న భాస్కర్ వచ్చినభక్తులకు అందరికీ కండువా అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి శ్రీనివాసులు ఉప సర్పంచ్ కేశవులు ఆలయ మాజీ చైర్మన్ మధుసూదన్ గౌడ్ గ్రామస్తులు లగిశెట్టి ప్రకాష్ బాలరాజు కోదండం పార్థసారథి వీరబ్రహ్మం మల్లికార్జున్ హిందు వాహిని యువకులు అడ్వకేటులు ఆంజనేయులు, శిరిష చంద్రప్రసాద్ డాక్టర్ తార శశాంక్ ఎద్దుల గోపాల్ సింగారం బుచ్చన్న చిగుళ్లపల్లి రమేష్ శెట్టి గాజుల సుధాకర్ జూనియర్ అసిస్టెంట్ నగేష్ ఆలయ పూజారి రంగాచార్యులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



**లింగాల, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన లింగాలలో ఎంతో ప్రశస్థిగల శ్రీ కోదండ రామచంద్రస్వామి పురాతన దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి స్వామి వారిని, అమ్మవారిని, దేవతామూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. వేకువ జామునే రంగనాథ స్వామి గోదాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి పల్లకిలో ఆలయం చుట్టూ భాజా భజంత్రీలతో ప్రదర్శన నిర్వహించి ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి తీసుకొని వచ్చారు. ఉదయం గోదాదేవి అమ్మవారి తిరువారాధన, తిరుప్పావై, భక్తులచే విష్ణు సహస్రనామ పారాయణం సామూహిక సంకీర్తనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పండితులు పూజారి దారూరిరామాచార్యులు సంప్రదాయరీతిలో శాస్త్రక్తంగా వైభవంగా పూజలు చేశారు. ధనుర్మాస పూజలో పాల్గొన్న భక్తుల కుటుంబ సభ్యులతో గోదా సహితరంగమన్నార్ అష్టోత్తర నామావళితో పుష్పార్చన చేశారు. భక్తులకు వైకుంఠ ఏకాదశి విశిష్టతను ఆయన వివరించారు. స్వామి వాళ్లకు నివేదించిన ప్రత్యేక తీర్థ ప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారు మ్రోగింది. సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య దంపతులు, ఆలయంలో దైవదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పూజారి భాస్కర్ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి మండల విద్యాధికారి బషీర్ అహ్మద్



**లింగాల, మేజర్ న్యూస్:** భాధ్యతలను విస్మరించకుండా పాధ్యాయుయులు సమయ పాలన పాటిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి బషీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని కేసీ తాండ, అంబటి పల్లి, రాయవరం, దత్తారం, కోమటికుంట పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయా పాఠశాలలకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించాలని సూచించారు. ఎఫ్ ఎల్ ఎస్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియల అందరికీ వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ 100% నమోదు అయ్యేవిధంగా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ సిఆర్పి పాల్గొన్నారు.

## యూరియా కొరతపై రైతు లకు ఆందోళన అవసరం లేదు. ఏవో ప్రియదర్శిని



**వంగూరు సూర్య న్యూస్ :** మండలంలోని రైతులకు యూరియా కొరతపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని మంగళవారం మండల వ్యవసాయ అధికారిని ప్రియదర్శిని తెలిపారు. యాసంగి 2025 సీజన్ కోసం యూరియా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆగ్రో రైతు సేవా కేంద్రం హాకా ఇతర ప్రైవేట్టుకాణాలలో మొత్తం 51.48 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు అవసరమైనంత మాత్రమే యూరియాను వాడాలని నిలువ చేయడం అధికంగా కొనడం ఇతరులకు అమ్మడం చేయకూడదని ఆమెఅన్నారు. పంట అవసరానికి తగ్గట్టు మాత్రమేయూరియానుకొనుగోలు చేయాలని రైతులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

## డిండిచింతపల్లి గ్రామాన్ని పారిశుద్ధ్యంలో అగ్రగామిగా నిలబెడుతా. సర్పంచ్ రామ్ భీష్మ



**వంగూరు సూర్య న్యూస్ :** మండలం లోనిడిండిచింతపల్లి గ్రామంలో మంగళవారం పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామ్ భీష్మ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలబారినుండితప్పించుకోవచ్చని అన్నారు. అందమైన గ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామస్థులందరినీ భాగస్వామ్యం చేస్తానని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి శివ నహీం సందీప్ వాసు జానీ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థి ఆది నవీన్ కుమార్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

**- ఆది నవీన్ కుటుంబానికి న్యాయం జరిగేదాకా పోరాటం -సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రాములు**




**పాలమూరు సూర్య న్యూస్:** దేవరకద్ర మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థి ఆది నవీన్ మృతి పై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. రాములు డిమాండ్ చేశారు. ఆది నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరం లోని అంబేద్కర్ చౌరస్తా లో ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. రాములు మాట్లాడుతూ దేవరకద్ర మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల (ప్రస్తుతం వనపర్తి జిల్లాలో కొత్తకోట మండలం అమడబాకుల (గ్రామ రెవెన్యూ శివారు) లో ఆది నవీన్ నవీన్ మృతి పట్ల అధికారులు పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం సిఈసీ చదువుతున్న ఆది నవీన్ నవంబర్ 9నఅదే కళాశాలకు చెందిన 5 గురు తోటి విద్యార్థులతో కలిసి బయటకు వెళ్ళి నలుగురు విద్యార్థులే కళాశాలకు వచ్చారని తెలిపారు.మరుసటి రోజు కాలశాల దగ్గర లోని కాలువలో ఆది నవీన్ కుమార్ శవమై కనిపించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద దళిత విద్యార్థి ఆది నవీన్ కుమార్ మృతి విషయంలో కొత్తకోట సిఐ కేసును తప్పుదారి పట్టిస్తున్నాడని ఆరోపించారు. ఆది నవీన్ తండ్రి ఇచ్చిన దరఖాస్తు పైన కేసు గాకుండా కళాశాల యాజమాన్యం ఇచ్చిన దరఖాస్తు పై కేసు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాల్సిన పోలీస్ అధికారులు తప్పుదోవదో పట్టించి అన్యాయం చేయడం తగదు అన్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, ఆది నవీన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చేతికి వచ్చిన కుమారుడి మరణంతో తీవ్ర మనోవేదనలకు గురవుతున్న కుటుంబానికి తగిన న్యాయం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం అందించాలని నినదించారు. ఆది నవీన్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ కురుమూర్తి, కిల్లె గోపాల్, నాయకులు చంద్ర కాంత్, రాజ్ కుమార్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భరత్,ఆయా సంఘాల నాయకులు వరదగాలన్న, ప్రశాంత్ ,శ్రీనివాసులు జహంగీర్, నందు, భాను, హైమావతి, మృతుడి తండ్రి ఆదివిష్ణు వర్ధన్ పాల్గొన్నారు.

## ఘనంగా 56వ ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** మహబూబ్నగర్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్ మాట్లాడుతూ ,ఎస్ఎఫ్ఐ దేశంలో విద్యార్థుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తుందంటూ తెలిపారు .ఎస్ఎఫ్ఐ కోసం ఎందరో వీరను మరణం పొంది మనకు యొక్క జెండాను అందించారు .ఆ జెండా యొక్క ఆశయాల కోసం మనం పని చేయాలంటూ వారి ఆశయాలను వీడబోమని వారి ఆశలు తోనే ఈ జెండా నడుస్తుందని వారు తెలిపారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన రాజకుమార్ మాట్లాడుతూ ,ఎస్ఎఫ్ఐ లో పురుషుల పాత్ర ఎంత ఉంటుందో స్త్రీల పాత్ర కూడా అంతే ఉంటుంది . ఎస్ఎఫ్ఐ అనేది ఎలాంటి కుల మత భేదాలు లేకుండా అందరూ సమానమే అంటూ చూపుతుందని వారు తెలిపారు ఎస్ఎఫ్ఐ అధ్యయనం పోరాటం అనే నినాదంతో నడుస్తుంది వారు మాట్లాడుతూ ,ఎస్ఎఫ్ఐ లో అధ్యయనం చేస్తూనే వాటిలో వచ్చిన సమస్యల కోసం పోరాడాలని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ మాట్లాడుతూ ,ఎస్ఎఫ్ఐ 1970 డిసెంబర్ 30 రోజున ఏర్పడిందని దాదాపు 56 సంవత్సరాల కాలంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థుల కోసం అనునిత్యం పోరాడుతూ వారి సంక్షేమం కోసం మేము నిలబడతామంటూ వారు వ్యక్తం చేశారు .ఈ క్రమంలో మా మీద ఎలాంటి కుట్రలు పండిన ఎన్ని కేసులు పెట్టినా విద్యార్థుల కోసం మా పోరాటాలు ఆగవంటూ వారు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎన్ని అవమానాలు వచ్చిన పట్టిన జెండాను విడవబమని ఎందరో ప్రాణ త్యాగాలకు నిదర్శనంగా ఉన్న యొక్క ఎస్ఎఫ్ఐ జెండాను వారి యొక్క ఆశల మీదగా నడుపుతామంటూ తెలియజేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భరత్ మరియు జిల్లా ఉపాధ్యక్షుడు నందు జిల్లా గర్ల్స్ కన్వీనర్ జ్ఞాపిక కమిటీ సభ్యులు హేమలత నవ్య స్రవంతి మనీషా హారిక ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక ఉచిత నట్టల నివారణ

**- మందులను సద్వినియోగం చేసుకోండి. - సర్పంచ్ జిల్లెల్ల శ్రీదేవి రాజేందర్ రెడ్డి**



**తెలకపల్లి సూర్య న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవాలకు అమలు చేస్తున్న ఉచిత సామూహిక నట్టల నివారణ మందులను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జిల్లెల్ల శ్రీదేవి రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దాసుపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు మరియు మేకలకు ఉచిత సామూహిక నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పాల్గొని పశుపోషకులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని 2082 గొర్రెలకు మరియు102 మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సామూహిక నట్టల నివారణ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాలలో డిసెంబర్ 31 వరకు కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మధు, వార్డు సభ్యులు అంజనమ్మ, కురువ చిట్టయ్య, కత్తె బీరయ్య ,బోడ ఆంజనేయులు, కురువ పరశురాములు, పశు వైద్య సిబ్బంది వెంకటేష్ అస్లాం చంద్రయ్య శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన మాజీ ఉప సర్పంచ్ లింగం యాదవ్...



**బాలానగర్ సూర్య :** మండల పరిధిలోని సూరారం గ్రామ నివాసి చాకలి జంగయ్య మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు పూడూరు లింగం యాదవ్ మంగళవారం స్థానిక సర్పంచ్ బుర యాదమ్మతో కలిసి మృతుని ఇంటికి చేరుకొని వారి కుటుంబానికి ప్రాగడ సానుభూతిని తెలుపుతూ కుటుంబ సభ్యులను ఓదార్చి మృతునీ కుటుంబానికి ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా లింగం యాదవ్ మాట్లాడుతూ మృతుని కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ప్రార్థిస్తున్నానని మృతున్ని కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా లింగం యాదవ్ ఓ ప్రకటన లో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర యాదమ్మ , ఉపసర్పంచ్ ఎలుకట్ట చంద్రశేఖర్, మహేష్,శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పొన్నకల్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ



**అడ్డాకుల, సూర్య న్యూస్ :** అడ్డాకుల మండల పరిధిలోని పొన్నకల్ లో మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండ జగదీష్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ జగదీష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రభుత్వ పథకాలలో మహిళల భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి : జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట టౌన్ సూర్యన్యూస్:** నూతన సంవత్సర వేడుకలు నారాయణపేట జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ... డిసెంబర్ 31 రాత్రి జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై వేడుకలు నిషేధించబడ్డాయని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపవద్దని, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురిచేయవద్దన్నారు. మద్యం దుకాణదారులు నిర్ణీత సమయం వరకే విక్రయాలు చేయాలన్నారు. అర్ధరాత్రి గుంపులు గుంపులుగా తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా స్నేహపూర్వక వాతావరణంలో శు భాకాంక్షలు తెలుపుకోవాలని విద్యార్థులు, యువతకు సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడతాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, షీ టీమ్స్, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తాయని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని, డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయానికి మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డ్రంకెన్ అండ్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్ధరాత్రి ‘ువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, బైక్ రేసులు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు కొనసాగుతుందన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముది రాజ్



**పాలమూరు సూర్య న్యూస్:** వైకుంఠ ఏకాదశి సంద ర్భంగా డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ మంగళవారం మహబూ బ్‌నగర్ జిల్లా కేంద్రం కాటన్‌మిల్ వెంకటేశ్వర స్వామి ఆలయం దర్శిం చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆయన సతీమణి అనుపమతో కలిసి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేలా వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. పూజా కార్యక్రమం అనంతరం జిల్లా ప్రజలకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన

### విద్యార్థినికి హాకి ఆటబహు కరించిన న్యాయవాది అశోక్ గౌడ్



**పాలమూరు సూర్య న్యూస్:** జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన వనపర్తి జిల్లా మదనాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఏడవ తరగతి విద్యార్థిని సాధిక మహమ్మదిని ప్రముఖ న్యాయవాది అశోక్ గౌడు మంగళవారం అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వనపర్తి జిల్లా కడుకుంట్ల లో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్లో పాల్గొని చక్కటి ప్రతిభా పాటవాలు ప్రదర్శించి జాతీయ హాకీ పోటీలకు ఎంపిక కావడం సంతోషకరం అన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో పాల్గొనే హాకీ స్టిక్, హాకీ బూట్లు, హాకీ షాకిన్స్, హాకీ చిన్ ప్యాడ్స్ ని బహుకరించారు. విద్యార్థికి మార్గదర్శంగా వ్యవహరించిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రామ్మోహన్ ను, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఐ సుదర్శన్ రావులను అభినందించారు.కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ మన్యం, ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, కొండా వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, శివ లీల, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు తప్పనిసరి

- లేని పాఠశాలల్లో నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**సూర్య,వనపర్తి ప్రతినిధి** :జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం తప్పక ఉండాలని, లేని పాఠశాలల్లో నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో శౌచాలయాలు, అంగన్వాడీల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం అంశాలపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో మరుగుదొడ్ల సౌకర్యం లేని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన నివేదికను విద్యాశాఖ అధికారుల ద్వారా తెప్పించుకుని కలెక్టర్ పరిశీలించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్ల సౌకర్యం లేని పాఠశాలల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద టాయిలెట్స్ మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ప్రక్రియను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు త్వరిత చేపట్టాలని, మార్చ్ 31వ తేదీ లోపు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా జిల్లాలోని 35 అంగన్వాడీ కేంద్రాల్లో ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో తాగునీటి వసతి కోసం చేపట్టిన పనులపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు కేవలం 9 అంగన్వాడీల్లో మాత్రమే తాగునీటి వసతికి పనులు పూర్తి చేసినట్లు,ఇంకా 26 అంగన్వాడీల్లో పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పగా ఆయా పనులని జనవరి మొదటి వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు.అదేవిధంగా అంగన్వాడీల్లో టాయిలెట్లు నిర్మాణం కోసం మంజూరైన పనులను కూడా జనవరి మొదటి వారంలోపు పూర్తి చేయాలని ఈడబ్ల్యూఐడీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అంతేకాకుండా, ప్రభుత్వానికి చెందిన పలు శాఖల పరిధిలో గత పదిహేళ్లుగా క్లైమ్ చేయని బ్యాంకు అకౌంట్లు ఉంటే వాటి సమాచారం తెలుసుకొని వెంటనే వాటిని ఆక్టివేట్ చేసుకోవాలని సూచించారు.తద్వారా ఆయా క్లైమ్ చేయని అకౌంట్లో ఉన్న నగదును ప్రజాప్రయోజనార్థం పనులకు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అన్ని పాఠశాలల్లో కలెక్టర్ నిధుల నుంచి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించడం జరిగిందని,ఇప్పుడు ఆయా పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్ వినియోగిస్తున్నారా ఇంకా కట్టెల పొయ్యి మాత్రమే వాడుతున్నారా? అన్ని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆరా తీశారు. తప్పనిసరిగా అన్ని పాఠశాలల్లో గ్యాస్ సిలిండర్ ద్వారా మాత్రమే వంట చేయాలని కట్టెల పోయి వినియోగించడం జరగవద్దని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిని ఉమాదేవి, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు,జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ విద్య విధానాన్ని అలవర్చుకోవాలి-వీసీ శ్రీనివాస్



**మహబూబ్ నగర్ పియూ సూర్య న్యూస్ :** మంగళవారం పాలమూరు విశ్వవిద్యాలయం లైబ్రరీ ఆడిటోరియంలో ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ హాజరయ్యారు. ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ,విద్యార్థిని విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలి అంటే ముందుగా రోజు తరగతులకు హాజరుకావాలని అలాగే లైబ్రరీ కి వెళ్లి కాంపిటీటివ్ బుక్స్ చదవాలని సూచించారు. ఖాళీ సమయంలో సమయము వృధా చేయకుండా ఆటలలో కూడా నైపుణ్యం సంపాదించుకోవాలని సూచించారు.అనంతరము ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయం ఎస్ఎఫ్ఐ శాఖ నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందినటువంటి విద్యార్థిని విద్యార్థులకు పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి ఎన్ శ్రీనివాస్ బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కో కన్వీనర్ మమత, జిల్లా కార్యదర్శి భరత్,యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు రాము రాజేష్ యాదవ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్,అరవింద్, విజయ,పూజ,విద్యులత రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సివిల్ సప్లై శాఖపై సమగ్ర విచారణ చేపట్టాలి

- అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న డీఎస్ఓ. కాశీవిశ్వనాథ్ పై చర్యలు తీసుకోవాలి
- ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని విచారణకు ఎలా పంపిస్తారు?
- అనుమతి లేని రైస్ మిల్లుకు ఎలా ధాన్యం దింపుతున్నారు?
- జిపిఎస్ సిస్టం లేకుండానే లారీలను నడుపుతున్న వైనం
- డీఎస్ఓ అవినీతిపై సీఎస్.రామ కృష్ణారావుకు ఫిర్యాదు చేసిన రాచాల



**సూర్య, వనపర్తి ప్రతినిధి** :అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్ పై పలుమార్లు ఫిర్యాదు చేసిన ఉన్నతాధికా రులు పట్టించుకోవడంలేదని...జిల్లా సివిల్ సప్లై శాఖపై సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు.మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయంలో తెలంగాణ సిఎస్.రామకృష్ణారావును కలిసి,వనపర్తి సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ అవినీతి, అక్రమాలపై.. ఆయనకు సహకరిస్తున్న ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పెబ్బేరు మండలంలోని అనుమతి లేని ఒక రైస్ మిల్లులో అక్రమంగా వడ్లు దిగుతున్నాయని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు తెలుసుకొని అక్కడికి వెళ్లి సందర్శించి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. విచారణకు వెళ్లిన డిఎస్ఓ నిస్సిగ్గుగా రైతుల ధాన్యమని చెప్పడం సిగ్గుచేటు అన్నారు.అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఎస్ఓను విచారణకు పంపించడం దేనికి సంకేతం అని? పట్టపగలు అవినీతితో దొరికిన కూడా వాటిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం డిఎస్ఓ చేస్తున్నాడని, అవినీతి అధికారులు అంతా కలిసి వనపర్తి పరువు తీస్తున్నారని మండిపడ్డారు. అనుమతి లేని మిల్లులలో వడ్లు ఎలా దింపారని? అనుమతి లేని మిల్లులో ఎలా నిల్వ చేస్తున్నారని? పిపిఎస్ సెంటర్ నుంచి ఎలా వచ్చాయని? ఇప్పటివరకు ఎన్ని గన్ని బ్యాగులకు ముద్రలు వేశారని? జిపిఎస్ సిస్టంతో నడవాల్సిన లారీలకు ఎన్ని జిపిఎస్ సిస్టమ్స్ అమర్చారో తెలపాలని ప్రశ్నించారు. అదేవిధంగా సెంటర్ కోడ్ కూడా ముద్రించడం లేదన్నారు. పెబ్బేరు పిపిఎస్ మొత్తం కూడా నేడు అవినీతిమయంలో ఉందని, పక్క జిల్లాలోని రైస్ మిల్లర్లు పెబ్బేరు మండలం లోని గోదాముల్లో అక్రమంగా తప్పుడు ట్రక్ షీట్స్ సృష్టించి నిల్వ చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. యంత్రాలు లేన మిల్లులకు ధాన్యం ఇచ్చినా, విద్యుత్ సదుపాయం లేని మిల్లులకు ధాన్యం ఇచ్చినా, తనకు నచ్చిన వారిని ఒకలా, నచ్చని వారిని మరోలా చూసినా, తాజాగా అనుమతి లేని రైస్ మిల్లుకు ధాన్యం ఇచ్చిన కూడా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా అవినీతి అధికారినే వెనకేసుకురావడం ఏంటని విస్మయం వ్యక్తం చేశారు.జిల్లా అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు బీసీ పొలిటికల్ జేఏసీకి ముఖ్యమని, అవినీతి అధికారులు ఎంతటి వారైనా తప్పు చేస్తే ఊరుకునేదే లేదని, విచారణ రిపోర్ట్ ఆధారంగా తదుపరి సీఎం ఏసీబీ అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు గాలిగల్ల సాయిబాబా, నగేష్ పాల్గొన్నారు.

## 5 రోజుల బ్యాంకింగ్ అమలు చేయాలి

### - ఎస్బీఐ రీజియన్ కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన



**పాలమూరు సూర్య న్యూస్:** 5 రోజుల బ్యాంకింగ్ అమలు చేయాలని కోరుతూ మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ నగరంలోని మెట్టుగడ్డ ఎస్‌బీఐ రీజినల్ బ్యాంకు కార్యాలయం ముందు ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం పై ఐబీఏ, ఏఐబిఈఏ తో అంగీకారం తెలిపినప్పటికీ అమలు చేయకపోవడం సరైంది కాదని ఇప్పటికైనా ప్రభుత్వ సరైన నిర్ణయం తీసుకోకపోతే ఆందోళన దూరం చేస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ కో -ఆర్డినేషన్ కమిటీ సెక్రటరీ పి. తిరుమల రెడ్డి, ప్రెసిడెంట్ జె. రాజేష్, ఎస్‌బీఐ %-% ఏఐబిఓసి జిల్లా కార్యదర్శి జగన్నాథ్ రెడ్డి, ఎస్‌బీఐ నాయకులు శ్రీ నరేష్, వెంకటేశ్వర్లు,అన్ని బ్యాంకుల ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన ఉపాధ్యాయుడు గాలముడి రాములు కు వీడ్కోలు



**రేవల్లి సూర్య న్యూస్ :** ఉపాధ్యాయ వృతికే వన్నె తెస్తూ, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆదర్శ ఉపాధ్యాయుడు గాలముడి రాములు మంగళవారం పదవి విరమణ చేశారు. రేవల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో వీడ్కోలు సభను అత్యంత వైభవంగా నిర్వహించారు. బయోసైన్స్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో ఉపాధ్యయుడు రాములు దంపతులను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పలువురు ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ 2009 నుండి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది, గత 16 ఏళ్లుగా జీవశాస్త్ర బోధనలో తనదైన ముద్ర వేశారన్నారు. ఆయన విద్యాశాఖలో దాదాపు 36 సంవత్సరాల పాటు అంకితభావంతో పని చేసినట్లు వెల్లడించారు. ఈ ఆత్మీయ విడుకోలు కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశిధర్ రెడ్డి, రజినీకాంత్, శ్రీనివాసులు, అర్జున్, వెంకటయ్య, జ్యోతి, శ్రావణి పాఠశాల కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పశువులకు నట్టల నివారణ టీకాలు తప్పనిసరి



**మాగనూర్ సూర్య న్యూస్ :** పశువులకు తప్పనిసరిగా నట్టల నివారణ టీకాలు వేయించాలని డాక్టర్ నరేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని నేరడగం గ్రామంలో పశువైద్య ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు, పశువులకు నట్టల నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ మందుల, టీకాల వల్ల పశువులు తీసుకునే మేతలోని పోషకాలు శరీరానికి సమర్ధంగా చేరి, వాటి పెరుగుదలతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా పశువులకు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా టీకాలు, వేయించుకోవడం ఎంతో అవసరమని ఆయన సూచించారు. ఇలా నివారణ చర్యలు చేపడితే పశుపాలకులకు ఆర్థిక నష్టం తప్పుతుందన్ని కాబట్టి ప్రభుత్వం అందించే ఉచిత పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి కోరారు. ఈ కార్యక్రమంలో నేరడగం గ్రామ సర్పంచ్ దాసరి వెంకటమ్మ, ఉప సర్పంచ్ రవి రాజా.వార్డు సభ్యులు ప్రకాష్,గుడిసె నర్సింహా, వాకిటి వెంకటేష్, వెంకటేష్, పశువుల పెంపకదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ విష సంస్కృతిని విడనాడుదాం - స్వదేశీ సంస్కృతిని కాపాడుదాం. విహెచ్ పి జిల్లా శాఖ

**నారాయణ పేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** జనవరి1 అని తాగి మన ఆరోగ్యాన్ని నాశనం చేసు కొని రోడ్లపై తిరుగుతూ ప్రాణాల మీదకు తెచ్చుకోకండీ అంటూ జిల్లా విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ చూచనలు చేసింది హిందూ సనాతన ధర్మం లో మనకు కొత్త సంవత్సరం ఉగాది కావున ఉగాదిని కొత్త సంవత్సరం జరుపుకోవాలన్నారు జనవరి 1తాగుబోతుల దినోత్సవాలు మనకుకేవలం తేదీ మాత్రమే మారుతుంది. ప్రకృతిలో ఎటువంటి మార్పు ఉండదన్నారు . మందు తాగి చిందుల వేయడం తప్ప ఏమీ లేదన్నారు మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం అంటూ విశ్వహిందూ పరిషత్ పిలుపునిచ్చింది ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పెద్దలు విహెచ్ పి జిల్లా అధ్యక్షురాలు సురేఖ రాంబాబు, జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, పట్టణ అధ్యక్షుడు మురళి బట్టడ్, విహెచ్ పినగర కార్యదర్శి ప్రవీణ్ కడదాస్, బజరంగ్దళ్ జిల్లా ప్రముఖ వడ్ల శ్రావణ్, నీరటి వెంకటేష్, ఆకాష్, విజయ్, చక్రి ,తదితరులు పాల్గొన్నారు.

## కందూరులో గొర్రెలకు నట్టల నివారణ



**అడ్డాకుల, సూర్య న్యూస్ :** అడ్డాకుల మండల పరిధిలోని కందూరులో మంగళవారం పశువైద్యాధికారి కె. రాములు ఆధ్వర్యంలో గొర్రెలకు నట్టల నివారణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్త కుంట రాధ, ఉప సర్పంచ్ నట్టల గోపాల్, వార్డు సభ్యులు జంగం పెద్ద బుర్రన్న, నాయకులు శ్రీనివాసులు, జంగం యాదయ్య, జంగం రవి, గణేష్, వీరమళ్ళ పెద్ద కొండన్న, మండల బీజేపీ అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణిలో ఎలాంటి అలసత్వం వహించిన చర్యలు తప్పవు

### - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్





**నాగర్‌కర్నూల్, సూర్యన్యూస్:** యూరియాను ఒకే దగ్గర నిలువ చేయడం పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని, ప్రాథమిక వ్యవసాయ కేంద్రం, యూరియా లభ్యత, సరఫరాను పర్యవేక్షిస్తున్నారు, యూరియా కొరత లేకుండా రైతులందరికీ అందేలా చూడాలని, అవసరమైతే ఉదయం 6 గంటల నుంచే అమ్మకాలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు, కృత్రిమ కొరత సృష్టించవద్దని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఆయన మాట్లాడుతూ, రైతుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సరఫరాలో జాప్యం చేయకుండా చూడాలని, ఎక్కడ యూరియా సమస్య తలెత్తకుండా,ఎరువుల క్రయ విక్రయాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా నిలువలనునమోదు చేయాలని, రైతులకు అవసరమైన యూరియా సరఫరాను అందించేందుకు అధికారులు అధికారులు ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేసి పకడ్బందీ చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెద్దకొత్తపల్లి వ్యవసాయ కేంద్రంలో యూరియాను ఒకే దగ్గర డంపు చేయడంపై సంబంధిత అధికారులపై కలెక్టర్ ఆగ్రహం చేశారు. ప్రస్తుత నిల్వలపై పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని, హోల్ సేల్, రిటైల్ డీలర్లు, సహకార సంఘాల గోదాములలో రోజువారి యూరియా స్టాక్ ను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ జిల్లా స్థాయిలో సమన్వయం చేసుకొని మండలాల్లో గ్రామాల వారీగా అవసరానికి అనుగుణంగా కేటాయింపు చేయాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించే లేదా ఇతర ఉత్పత్తులతో ప్రైవేట్ డీలర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి, అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామిక అవసరాలకు సబ్సిడీ యూరియా మళ్లించే అవకాశమున్న యూనిట్లపై తనిఖీలు చేసి, వారి ఉత్పత్తి గణాంకాలు, బిల్లులు సరిపోల్చి, ఏమైనా పెద్ద వ్యత్యాసం ఉంటే డీలర్ మరియు యూనిట్‌పై కేసులు నమోదు చేయాలన్నారు. యూరియా వినియోగాన్ని సమీక్షించేందుకు రోజువారీగా రైతుల యూరియా కొనుగోలులకు ప్రాధాన్యత అనుగుణంగా, కొనుగోలుదారులు, తరచుగా కొనేవారు, అధికంగా అమ్మిన రిటైలర్ల వివరాలను తనిఖీ చేయాలని తనిఖీ చేయాలని మండల వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట పెద్దకొత్తపల్లి తాహసిల్దార్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ అధికారులు తదితరులు ఉన్నారు.

## పెద్దకొత్తపల్లి ఎరువుల కేంద్రాన్ని కలెక్టర్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మిక తనికి.





**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్:** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని కలెక్టర్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేసి, యూరియా లభ్యత, సరఫరా వ్యవస్థను పర్యవేక్షించారు. రైతులకు ఎలాంటి కొరత లేకుండా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఉదయం 6 గంటల నుంచే అమ్మకాలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించవద్దని హెచ్చరించారు.రైతుల రద్దీ దృష్ట్యా సరఫరాలో జాప్యం జరగకుండా చూడాలని, ఎరువుల క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోయూరియా సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీగా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.పెద్దకొత్తపల్లి వ్యవసాయ కేంద్రంలో యూరియాను ఒకేచోట డంప్ చేయడంపై సంబంధిత అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, హోల్‌సేల్, రిటైల్ డీలర్లు, సహకార సంఘాల గోదాముల్లో రోజువారీ స్టాక్‌ను కచ్చితంగా పర్యవేక్షించాలని తెలిపారు. మండలాల వారీగా గ్రామాల అవసరాలకు అనుగుణంగా యూరియా కేటాయింపులు జరగాలన్నారు. అధిక ధరలకు యూరియా విక్రయించే ప్రైవేట్ డీలర్లు, ఇతర ఉత్పత్తులతో కలిపి అమ్మే వారిపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశ్రామిక అవసరాలకు సబ్సిడీ యూరియాను మళ్లించే యూనిట్లపై తనిఖీలు చేసి, ఉత్పత్తి గణాంకాలు, బిల్లులు సరిపోల్చి వ్యత్యాసాలు ఉంటే కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.యూరియా వినియోగాన్ని సమీక్షించేందుకు రోజువారీగా రైతుల కొనుగోళ్లను పర్యవేక్షించి, తరచూ కొనుగోలు చేసే వారు, అధికంగా అమ్మిన రిటైలర్ల వివరాలు తనిఖీ చేయాలని మండల వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి ఇతర వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పతాకాలపై అవగహన సదస్సు..



**కోస్గి సూర్య న్యూస్:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పతకాల పట్ల మహిళలకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎం ఓ ఐ ఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ నారాయణ తెలిపారు. మంగళవారం కోస్గి పట్టణంలోని మహిళ సమాఖ్య భవనంలో ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ అద్వర్యంలో నిర్వహించిన సదస్సులో జోగిని లకు పొదుపు,మహిళలకు ప్రభుత్వ పతాకాలపై అవగహన కల్పించారు.ఈసందర్బంగా ఉమ్మడి జిల్లాలో 350 గ్రామాలలో మహిళల సంక్షేమం జోగిని వ్యవస్థ నిర్మూలన,బాల్య వివాహాలు నిర్మూలనపై ఈసంస్థ పనిచేస్తుందని ఆయన అన్నారు. వెలుగు,సమాఖ్య,సీసీ లు పిల్లి నర్సింలు కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి మహిళ పొదుపు సంఘంలో ప్రభుత్వం ఇచ్చే ఋణాల సౌకర్యంతో లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం మండల కోఆర్డినేటర్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ కార్మిక సభ్యత్వం కలిగి ఉండాలని సుకన్య సంవృద్ధి యోజన స్కీమ్ ను సద్వినియోగం చేసుకొవాలని అన్నారు. ఆడపిల్లలకు ప్రభుత్వం పాఠశాలలు, గురుకులాలు, హాస్టల్ సౌకర్యాలు కల్పిస్తున్నాయని అందుకే ఆడపిల్లలను చదివించాలని అన్నారు.ఆడపిల్లలకు 18 ఏళ్ళు నిండిన తరువాత పెళ్లి చేయలని,తక్కువ వయస్సు ఉన్న అమ్మాయిలకు వివహాలు చేయడం చట్టపరంగా నేరమని,అవి బాల్య వివాహాల పరిధిలోకి వస్తాయని అలా చేయడం చట్ట విరుద్ధమన్నారు.చిన్న పిల్లల సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 1098కి ఫోన్ చెయ్యాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎం ఓ ఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ నారాయణ, మండల కోఆర్డినేటర్ లు ఈశ్వప్ప ,ఈశ్వరమ్మ, ఆరోగ్య కార్యకర్తలు,మొగులమ్మ, శారద పద్మ,సులోచన కృష్ణవేణి,లక్ష్మీ,నరసమ్మ, అషమ్మ, నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు శ్రావణీ, ప్రసాద్,వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

## న్యూఇయర్ వేడుకలు శాంతి యుతంగా జరుపుకోవాలి. -ఎస్సై ఎస్ఎం.నవీద్




**కృష్ణ సూర్య న్యూస్ :** డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు, యువత న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని ఎస్సై ఎస్ఎం.నవీద్ సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం పత్రిక సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ డిసెంబర్ 31 అర్ధరాత్రిలో మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, వేగ నియంత్రణ, రోడ్డు నియమాలు పాటించి, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ముఖ్యంగా రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్, స్టంట్స్, గందరగోళం సృష్టించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పోలీస్ పెట్రోలింగ్ పెంచుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. డీజేలు, శబ్ద కాలుష్యం నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుడదని,ఈ నూతన సంవత్సర వేడుకలు ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని అందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే డయల్ 100 ,112 లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. ప్రజల సంక్షేమమే పోలీసుల ప్రధాన ధ్యేయమని ఎస్సై నవీద్ పేర్కొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ కు వినతి



**మాగనూర్ సూర్య న్యూస్ :** నేరేడగం గ్రామం మీదుగా ఉజ్జెలి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని మంగళవారం నారాయణ పేట బస్సు డిపో మేనేజర్ కు నేరడగం సర్పంచ్ తనయుడు డీ ప్రకాష్, ఉప సర్పంచులు సంయుక్తంగా వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉజ్జెల్లి ఉప సర్పంచ్ రాజు మాట్లాడుతూ ఉజ్జెల్లి గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడం ద్వారా ప్రతి సంవత్సరం మక్తల్ ఇతర లాంటి ప్రాంతాలకు వచ్చి చదువుకునే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ప్రైవేట్ వెహికల్స్ లో పరిమితి కన్నా ఎక్కువగా కూర్చోపెట్టుకోవటం ద్వారా ఆక్సిడెంట్ అయిన సంఘటనలు జరిగాయన్నారు. కాబట్టి అధికారులు తక్షణమే చొరవ చూపించి ఉజ్జెల్లి గ్రామం మీదుగా బస్సు సౌకర్యం కల్పించి ప్రజలకు విద్యార్థులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉజ్జెల్లి ఉప సర్పంచ్ ఎం.రాజు,వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి.సోంనాథ్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్.ఎఫ్.ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### - ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరహరి



**నారాయణ పేట టౌన్ సూర్య న్యూస్ :** విద్యార్థి పోరాటాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ జెండాను నరహరి ఆవిష్కరణ చేసి అనంతరం ఆయన మాట్లాడుతున్న సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ 1970 సంవత్సరంలోని కేరళలోని త్రివేంద్ర నగరంలో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో, "అధ్యయనం -పోరాటం" నినాదంతో డిసెంబర్ 29,30,31 తేదీలలో 8 మంది తోటి ఏర్పడి నేడు దేశంలోనే 30 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఆవిర్భవించింది. నేడు దేశంలో చదువుతున్నటువంటి విద్యార్థులందరికీ నాణ్యమైన, శాస్త్రీయమైన ఉచిత విద్య ప్రతి ఒక్కరికి అందాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ కూడా ఒక తాగుబోతులకి మంత్రిని కేటాయిస్తారు తప్ప విద్యాశాఖ కి మంత్రి లేకపోవడం చాలా సిగ్గుచేటు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ మాట్లాడుతూ తక్షణమే తెలంగాణ రాష్ట్రంలోని విద్యాశాఖ మంత్రిని నియమించి, పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్, ఫీజు రియాంబర్స్మెంట్ విడుదల చేసి, సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, అనిల్, మమత, అశ్విని వీరితోపాటు 50 మంది విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన బీఆర్ఎస్ నాయకుడు



**అడ్డాకుల, సూర్య న్యూస్ :** అడ్డాకుల మండల పరిధిలోని కొందరాంలో మంగళవారం సోలీపూర్ నాగమ్మ మృతి చెందడంతో స్థానిక బీఆర్ఎస్ నాయకుడు మున్నూరు రమేష్ మృత దేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి రూ. 5000 లు ఆర్థిక సాయం అందజేశారు. నివాళులు అర్పించిన వారిలో కదిరె శ్రీనివాసులు, కాటారం శంకర్, వార్డు సభ్యులు పిల్లి చంద్రమౌళి యాదవ్, వీరమల్ల శ్రీలత, రమేష్ యాదవ్, ఓంకార్, రాములు, మాల రాములు, వెంకటేష్, రాములు, శేఖర్, అంజి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పెద్దకొత్తపల్లి సర్పంచ్ రేణుక నాగరాజుకు బిజెపి ఘన సన్మానం.



**పెద్దకొత్తపల్లి, సూర్య న్యూస్:** వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా మంగళవారం తిరుమలాపూర్ గ్రామంలో పెద్దకొత్తపల్లి సర్పంచ్ బెట్టరి రేణుక నాగరాజును భారతీయ జనతా పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా మాజీ అధ్యక్షులు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్ రావు ఘనంగా సత్కరించారు.వైకుంఠ ఏకాదశి పూజా కార్యక్రమాలకు హాజరైన సందర్భంగా అక్కడే ఉన్న సర్పంచ్ రేణుక నాగరాజును బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు, తిరుమల్ యాదవ్, సాతాని శ్రీను, రాష్ట్ర నాయకులు జలాల్ శివుడు తదితరులు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ సేవలు అభినందనీయమని ప్రశంసించారు. సర్పంచ్ బెట్టరి రేణుక నాగరాజు తనను సన్మానించిన ఎల్లేని సుధాకర్ రావు సహా బీజేపీ నాయకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొని కార్యక్రమానికి విశేష శోభను చేకూర్చారు.

## పాఠశాలకు ఫైబర్ నెట్ ని సమకూర్చిన ఉపసర్పంచ్, వార్డు సభ్యులు



**కోడేరు, సూర్యన్యూస్ :** మండల పరిధిలోని కొండ్రావుపల్లి గ్రామంలో ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆన్లైన్ మరియు డిజిటల్ తరగతుల కొరకు విద్యార్థుల అవసరాల నిమిత్తం ఉపాధ్యాయుల కోరిక మేరకు ఆ గ్రామ ఉపసర్పంచ్ ఎల్లాల సత్యమ్మ మరియు వార్డు సభ్యులు పాఠశాలలో ఎయిర్ టెల్ 5జి ఎయిర్ ఫైబర్ నెట్ ను సమకూర్చి ప్రధానోపాధ్యాయులకు అందజేయడం జరిగింది. డిజిటల్ తరగతులను ఉపయోగించుకొని విద్యార్థులు చక్కగా చదువుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మారేడి కోటేశ్వరయ్య ,కొమ్మ బాల పీరు, నీలవేణి ఆంజనేయులు, జక్కుల ఆంజనేయులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కు కొత్తచెరువు తండా పంచాయతీ పాలకమండలి సన్మానం



**లింగాల, మేజర్ న్యూస్:** ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో వివిధ గ్రామ పంచాయతీలలో గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యులు మండల వివిధ శాఖల అదికారులను పరిచయం చేసుకుంటూ సన్మానం చేసే బాట పట్టారు. మంగళవారం మండల పరిధిలోని కొత్త చెర్వు తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ దేవిహంఖ్య నాయక్ నెత్రుత్వంలో వార్డు సభ్యులతో కూడిన పాలకమండలి తహసిల్దార్ వెంకటేష్ ఆయన ఛాంబర్ లో శాలువాతో సన్మానించి పరిచయం చేసుకున్నారు. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధి తోనే దేశం పురోభివృద్ధి చెందుతుందని తహసీల్దార్ వెంకటేష్ అన్నారు.గ్రామాన్ని పాలించే విశేష అధికారం గల గ్రామ పాలక మండలికి మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని చురగోనాలని అన్నారు. గ్రామాల ప్రజల రెవిన్యూ సమస్యల త్వరితగతిన పరిష్కరిస్తూ గ్రామాల అభివృద్ధి కి ప్రభుత్వపరంగా తోడ్పాటు అందిస్తానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కొత్త చెరువు తండాలో నెలకొన్న సమస్యలను సర్పంచ్, వార్డు సభ్యులు వివరించారు.రేషన్ బియ్యం కొత్తచెరువు తాండలో ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కు వినతి పత్రం ఇవ్వగా సానుకూలంగా స్పందించిన్నట్లు సర్పంచ్ దేవి హంఖ్య నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తచెరువు తాండ సర్పంచ్ దేవిహంక్య, వార్డ్ సభ్యులు రాములు కవిరామ్ మహారాజ్, మండల నర్సింహ్మ ,గోడవర్ల రేనయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు చేపట్టిన సర్పంచ్



**కోడేరు, సూర్య న్యూస్:** మండల పరిధిలోని తేలపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ దేవర పాగ సురేష్ మంగళవారం గ్రామంలో పారిశుద్ధ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మురుగు కాలువలు ఎక్కడికక్కడ చెత్తాచెదారంతో పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని గమనించి పరిశుద్ధ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా గ్రామంలో అక్కడక్కడ కంపచెట్ల పెరగడంతో అట్టి ముళ్ళపదలను తొలగించినట్లు ఆయన తెలిపారు.

## కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి



**గండీడ్ మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని బీజేపీ రాష్ట్ర నాయకులు గిరమోని శ్రీనివాస్, గండీడ్ మండల బిజెపి అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి అన్నారు.మంగళవారం పగిడ్యాల గ్రామంలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి మంజూరు చేసిన 5 లక్షల రూపాయల ఎంపీ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి గండీడ్ మండల బిజెపి అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోపాటు, ఎంపీ నిధులతో గ్రామాలలో అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రె కిష్టప్ప,మండల బిజెపి ప్రధాన కార్యదర్శి నరహరి రెడ్డి, బిజెపి ఉపాధ్యక్షులు గడ్డమీది మల్కయ్య,భద్రేశ్వర్, నాయకులు సంగమేశ్వర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం వేడుకలు

### ప్రశాంతం గా జరుపుకోవాలి- ఎస్సై నాగరాజు



**సూర్య మేజర్ /న్యూస్ :** చిన్నంబావి మండలంలోని గ్రామాలలో నూతన సంవత్సర వేడుకలు శాంతి భద్రతలు భంగం కలిగకుండా వేడుకలు నిర్వహించాలని ఎస్ ఐ నాగరాజు కోరారు. అయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంతం గా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.నిబంధన లు అతిక్రమించి ఎక్కువ చేస్తే వారిపై చట్ట ప్రకారం మైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్ మద్యం సేవించి ఆహనాన్ని నడిపితే వాహనం సీజ్ వాటితో పాటు భారీ జరిమాణం,మరియు,కేసునమోదుచేయబడుతుందని డీజే నిషేధం శబ్ద,కాలుష్యం. కలగజేసి, అధికంగా, శబ్దంతో, మ్యూజిక్, సిస్ట, అనుమతిలేదన్నారు. అసభ్యప్రవర్తన, రహదారూపై గుంపులు గుంపులు కనబడితే కఠిన చర్యలు తప్పవని అయన పేర్కొన్నారు.

## రవీంద్రభారతిలో సర్పంచులకు సన్మానం



**నవాబుపేట్ సూర్య న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఎన్నికల్లో సర్పంచులుగా గెలుపొందిన ముదిరాజుల అందరికీ రాష్ట్ర రాజధానిలోని రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించడం జరిగింది.మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముదిరాజుల పెద్దలు శాసనమండలి డిప్యూటీ స్పీకర్,మాజీ ఎంపీ డాక్టర్ బండ ప్రకాష్,రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి,ఎంపీ,మాజీ మంత్రి ఈటెల రాజేందర్,మాజీ శాసనమండలి సభ్యులు కాసాని జ్ఞానేశ్వర్,రాష్ట్రం ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్,మహబూబ్ నగర్ డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజులు హాజరై మండలంలోని,పోమాల సర్పంచ్-కవితనరేష్,అమ్మాపూర్ సర్పంచ్-రవణీలసుమన్,ఇప్పటూర్ సర్పంచ్-రవికిరణ్,కామారం సర్పంచ్-వెంకటేష్,పల్లెగడ్డ సర్పంచ్-బాలరాజ్,కూచూర్ సర్పంచ్-సుమతిరవి,మల్లారెడ్డిపల్లి సర్పంచ్-తోటరాములు ముదిరాజులను, అభినందిస్తూ ఘనంగా సన్మానించడం జరిగింది.

## శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయాన్ని సందర్శించిన న్యాయమూర్తి



**గద్వాల సూర్య ప్రతినిధి:** గద్వాల పట్టణంలోని కోట లో గల శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయాన్ని వైకుంఠ ఏకాదశి సందర్భంగా గద్వాల సీనియర్ సివిల్ జడ్జి టి.లక్ష్మి ఉత్తరద్వారం ద్వారా స్వామివారిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ కర్త ప్రభాకర్ అర్చకులు న్యాయమూర్తికి పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించి స్వామివారి వస్త్రాన్ని బహుకరించారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు : జిల్లా కలెక్టర్

**గద్వాల సూర్య ప్రతినిధి :** జోగులాంబ గద్వాల జిల్లాలో రైతులకు కావాల్సినంత యూరియా అందుబటులో ఉందని, కొరత ఉన్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలుచోట్ల రైతులు యూరియా కోసం బారులు తీరి ఇబ్బందులు పడుతున్నట్లు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదన్నారు. రైతులు ప్రస్తుత పంటకు కావాల్సినంత యూరియా తీసుకోవచ్చని, కొరత వస్తుందే మోనని ఆందోళన పడవద్దు అన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా 5816 మెట్రిక్ టన్నుల యూరియా అందించగా, ఇంకా 8124 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. పిఎసిఎస్ కేంద్రాలతో పాటు అగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లోనూ యూరియా అందుబాటులో ఉందన్నారు. గద్వాల మండల పిఎసిఎస్ కేంద్రం వద్ద రైతులు ఎక్కువగా లైన్ లో ఉంటుండడంతో పాత బస్టాండు, మార్కెట్ యార్డులో ఉన్న అగ్రోస్ కేంద్రాల వద్ద కూడా యూరియా తీసుకోవచ్చు అన్నారు. రైతులు యూరియా తీసుకునేందుకు వచ్చేటప్పుడు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ లు తీసుకొని రావాలన్నారు. యూరియా కొనుగోలులో ఎలాంటి సమస్యలు ఎదురైనా రైతులు సంబంధిత మండల వ్యవసాయాధికారులను సంప్రదించవ చ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

## "ఏడు ఏళ్ల అంకితభావానికి గుర్తింపు : ఆర్ఐగా పదోన్నతి"

### - పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది జిల్లా ఎస్పీ.



**గద్వాల సూర్య ప్రతినిధి:** జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ విభాగంలో మరో విశేష పరిణామం చోటుచేసుకుంది. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ ఎస్సై విజయభాస్కర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపిఎస్.,ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ విజయభాస్కర్‌కు స్టార్లు తొడిగి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "ఉద్యోగ జీవితంలో పదోన్నతి కేవలం గౌరవం మాత్రమే కాదు, బాధ్యతను మరింత పెంచే ఘట్టం. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి" అని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ు విజయభాస్కర్ జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఆర్ఎస్ఐగా దాదాపు ఏడు సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించారని తెలిపారు. అందులో నాలుగు సంవత్సరాలు గద్వాల్ ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రత, ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణ వ్యవస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. అదేవిధంగా మూడు సంవత్సరాలు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ, సమన్వయంలో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. తదుపరి నారాయణపేట జిల్లాకు బదిలీపై వెళ్తున్న విజయభాస్కర్ గద్వాల్ జిల్లాలో అందించిన సేవలను ఎస్పీ ప్రత్యేకంగా కొనియాడుతూ, కొత్త జిల్లాలోనూ ఇదే నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్ రావు, ఆర్.ఐ. వెంకటేష్ పాల్గొని అభినందనలు తెలిపారు. ఈ పదోన్నతి కార్యక్రమం జిల్లా పోలీస్ విభాగంలో ఉత్సాహాన్ని నింపిన సందర్భంగా నిలిచింది.

## ఎమ్మార్వోను సన్మానించిన సర్పంచ్ రంజిత్ కుమార్



**సూర్య మేజర్ న్యూస్:** చిన్నంబావి గ్రామ మరియు మండల సర్పంచ్ గా రెండవసారి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల కేంద్రంలో గల ఎమ్మార్వో ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి వారిని శాలువతో సన్మానించి గ్రామ మండల కేంద్ర,అభివృద్ధిలో, సహకరించాలని సర్పంచ్ రంజిత్ కుమార్ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, బిచ్చన్న, మాజీ, ఉపసర్పంచ్, మునిస్వామి ,బాలస్వామిమధు,రామకృష్ణ,నాగరాజు గ్రామయువత పాల్గొన్నారు.

## మెడికల్ ఎంబిబిఎస్ 2025-2026 వైట్ కోర్ట్ పంపిణీ కార్యక్రమానికి పాల్గొన్న ఎమ్మెల్యే

### - మెడికల్ కాలేజ్ నందు నూతన లైబ్రరీ, కంప్యూటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

### - త్వరలోనే నూతన మెడికల్ కళాశాల భవనానికి శంకుస్థాపన



**గద్వాల సూర్య ప్రతినిధి :** మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నందు నూతన ఎంబిబిఎస్ 2025-2026 విద్యార్థిని విద్యార్థులకు వైట్ కోట్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థినీ విద్యార్థులకు వైట్ కోట్ ను పంపిణీ చేయడం జరిగినది. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గద్వాల ప్రాంతంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేయడం జరిగింది ఎమ్మెల్యే కృషితోనే నేడు మెడికల్ కాలేజీ రావడం జరిగిందని తెలిపారు. మెడికల్ కాలేజీ ఏర్పాటులో విద్యార్థులకు ఇలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు లెక్చరర్స్ అన్ని విషయంలో ఎమ్మెల్యే ఎక్కడ కూడా రాజీ పడలేదు ఈ ప్రాంతంలోని మెడికల్ కాలేజీ విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందిస్తే వారు భవిష్యత్తులో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా ఉంటారని ఉద్దేశంతో ఒక నిర్ణీతమైన లక్ష్యంతో గద్వాల ప్రాంతం అభివృద్ధి వైపుగా అడుగులు వేసే దిశగా అహర్నిశలు ఎమ్మెల్యే కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ కాలేజీలు ఏ చిన్న పొరపాటు జరిగిన అది ఎమ్మెల్యేకి గద్వాల ప్రాంతానికి చెడ్డ పేరు రావడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో నడుచుకోవాలి ఎంతో కష్టపడి మీ తల్లిదండ్రులు మీకు చూపించడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు లెక్చర్లు కు సహకరిస్తూ వైద్య వృత్తిని పొందాలి భవిష్యత్తులో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి ఉత్తమ వైద్యురాలు అవార్డు పొందాలి అదేవిధంగా మీ తల్లిదండ్రులకు గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గద్వాల ప్రాంతం నడిగడ్డ ప్రాంతం ఇటు కర్నూలు అటు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా లో నడిగడ్డ గద్వాల ప్రాంతం ఉన్నది ఏ చిన్న సమస్య వచ్చినా కర్నూల్ కు రాయిచూర్ కు వెళ్లవలసిన పరిస్థితి ఉండేది. కానీ వల ప్రాంతంలో మెడికల్ కాలేజీ రావడం వల్ల భవిష్యత్తులో అలాంటి పరిస్థితి రాదు గద్వాలలోనే ప్రజలకు మెరుగైన వైద్యము అందించే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ ను భవనంలో కొనసాగించడం జరుగుతుంది త్వరలోనే నూతన మెడికల్ కాలేజ్ భవనం శంకుస్థాపన జరుగును. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో హాస్టల్ సౌకర్యంతో మెడికల్ కాలేజ్ నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. మీరు మెడికల్ వృత్తిని ఎంచుకొని ప్రజలకు సేవ చేయించాలని నిర్ణయించుకున్నారు మీకు సహకరించిన మీ తల్లిదండ్రులకు అదే విధంగా మీరు కూడా మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి అదేవిధంగా గద్వాల ప్రాంతానికి కూడా మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ సర్పంచ్, మహబూబ్, నాయకులు శ్రీరాములు, వీరేష్ హాస్పిటల్స్ సూపర్డెంట్, మెడికల్ కాలేజ్ లెక్చరర్స్ అండ్ డాక్టర్స్ , తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు గుదిబండగా జీవో 252 టిడబ్ల్యూజేఎఫ్‌తోనే సమస్యలు పరిష్కారం

### - టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య



**గద్వాల సూర్య ప్రతినిధి :** జీవో 252 జర్నలిస్టులకు బుద్ధిబండగా మారిందని, టీ డబ్ల్యూ జె ఎఫ్ తోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో మంగళవారం టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా మూడవ సభలు సీనియర్ జర్నలిస్టు ఎస్ ఆశన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బసవ పున్నయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఉన్న జర్నలిజానికి ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయని, ప్రస్తుతం ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా బసవ పున్నయ్య మాట్లాడుతూ జీవో 252 ను ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే టి డబ్ల్యూ జే ఎఫ్ ఆధ్వర్యంలో కమిషనర్ను కలిసి సమస్యను వివరించడం జరిగిందన్నారు. స్వలాభాల కోసం యూనియన్లను వాడుకోరాదని సూచించారు. సంఘం సభ్యులు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలన్నారు. సమస్యలను వెలికి తీసినప్పుడు జర్నలిస్టులకు మంచి పేరు వస్తుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ మీడియా అక్రిడేషన్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధన జీవో నెంబర్ 252 వల్ల జర్నలిస్టులకు నష్టం జరుగు తుందన్నారు. ముఖ్యంగా చిన్న పత్రికల మనుగోడ కష్టమవు తుం దన్నారు. లక్షల సర్కిలేషన్ న్యూస్ పేపర్లు ఉంటేనే అక్రిడేషన్ నిబం ధనలు పెట్టడంసరైనది కాదన్నారు. పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం మూడు యూనియన్లు కొనసాగుతున్నాయన్నారు. నిరసన కార్యక్రమాలు అక్రిడేషన్ నిబంధనలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ కార్యాల యాల వద్దనిరసనలు తెలపాల్సిన బాధ్యత ఉందన్నారు. జర్నలిజం విలువలు కాపాడాలన్నారు. జిల్లా నూతన కమిటీ ఎన్నిక టిడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా వెంకటన్న, కోశాధికారిగా రాముడు, ఉపాధ్యక్షులు కె వీరన్నాచారి, రాముడు, తిరుమలేష్, సహాయ కార్యదర్శిలు బుచ్చన్న, శాంతిరాజు, ఆశన్న, రాఘవ గౌడ్, ఈసీ సభ్యులు వెంకట్ రాములు ఆంజనేయులు మద్దిలేటి వెంకటేశ్వర్లు సుధాకర్ లవకుశ అనిల్, టి రామ్మోహన్ రెడ్డి ఎంపికయ్యారు.

## గణిత విజ్ఞాన మేళలో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

### - ఉపాధ్యాయునికి %-% విద్యార్థి బంధం రైతుకు%-%పంటకు ఉన్న బంధంలాంటిది" %-% జిల్లా ఎస్పీ



**గద్వాల సూర్య ప్రతినిధి :** జోగులాంబ గద్వాల్ జిల్లా లోని గద్వాల్ పట్టణంలో ఉన్న ప్రభుత్వ బాలుర పాఠశాలలో జిల్లా స్థాయి మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్%-%2025 సందర్భంగా ఏర్పాటు చేసిన గణిత విజ్ఞాన మేళ అందరినీ ఆకట్టుకుంది అని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు, ఐపిఎస్., అన్నారు. ఈ మేళలో జడ్పిహెచ్ఎస్ అమరవాయి పాఠశాల విద్యార్థులు పాల్గొని, గణితానికి సంబంధించిన వినూత్న మోడళ్లు, ప్రాజెక్టులతో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారు రూపొందించిన ప్రతి మోడల్‌పై ప్రశ్నలు అడిగి వారి అవగాహనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంత చక్కగా ప్రదర్శించడం నిజంగా అభినందనీయం. నేను నా చిన్నతనంలో ఇలాంటి అవకాశాలు పొందలేకపోయానని ఇప్పుడు అనిపిస్తోంది" అని అన్నారు. అలాగే, "టీచర్‌కు విద్యార్థికి మధ్య ఉన్న బంధం రైతుకు పంటకు ఉన్న బంధంలాంటిదే. ఉపాధ్యాయులు తలుచుకుంటే ఎవరికైనా మంచి భవిష్యత్తు ఇవ్వగలరు" అని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసంపైనా దృష్టి పెట్టి, తల్లిదండ్రులు, గురువులు, ఊరు, జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. మీలో చాలామంది భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నానని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్%-%2025లో ప్రతిభ కనబరిచి స్టేట్ లెవెల్‌కు ఎంపికైన 6 మంది విద్యార్థులు అయిన విజయలక్ష్మి %-% జడ్పిహెచ్ఎస్, తనగల, బి. సురేంద్ర %-% జెడ్పిహెచ్ఎస్, భూంపురం, నిక్షిత %-% గర్ల్స్ హై స్కూల్, గద్వాల్, నవీన్ %-% జెడ్పిహెచ్ఎస్, రాజోలి, జీవితేష్ %-% జడ్పిహెచ్ఎస్, రామాపురం, చిన్నికృష్ణ %-% జడ్పిహెచ్ఎస్ ధరూర్ ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావుతో పాటు గద్వాల్ టౌన్ ఎస్.ఐ. కళ్యాణ్ కుమార్, గద్వాల్ ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ బాలచంద్రుడు, ప్రభుత్వ బాలుర హై స్కూల్ హెడ్ మాస్టర్ రేణుకాదేవి, టి.ఎమ్.ఎఫ్. అధ్యక్షుడు బసవరాజు, టి.ఎమ్.ఎఫ్. ప్రధాన కార్యదర్శి అనిత, టి.ఎమ్.ఎఫ్. గౌరవ అధ్యక్షులు, గెజిటెడ్ హెడ్ మాస్టర్లు వరద సుందర్ రెడ్డి-ధర్మవరం, వి. నరేష్ - అమరవాయి, జగదీశ్వర్ రెడ్డి-వెలుగొండ ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిట్ట సదగోడు గ్రామంలోఉచిత వైద్య శిబిరం విజయవంతం



**వంగూరు సూర్య న్యూస్ :** మండలంలోని మిట్ట సదగోడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మిట్ట సధగోడు గ్రామ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఎం. అరుణ పాండు రంగా రెడ్డి అభ్యర్థన మేరకు శ్రీ వెంకటరమణ హాస్పిటల్ యశోద హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు గ్రామంలోని 400 మందికి పైగా షుగర్ రక్తపోటు పిల్లల ఆరోగ్య సమస్యలు ఎముకల సమస్యలపై ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి షుగర్ ఈసీజీ వంటి పరీక్షలతో పాటు సుమారు రూ.1 లక్ష విలువైన మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో హర్షిత్ రెడ్డి పాండు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అవగాహన అప్రమత్తతే : ఇంటి భద్రతకు సమాజ రక్షణకు నాంది!



**గద్వాల సూర్య ప్రతినిధి :** జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, పోలీస్ కళాబృందం గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలు, పోక్సో చట్టం, సీసీ కెమెరాల ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించింది. కళాబృందం సభ్యులు డయల్%-%100 సేవల వినియోగం, బ్లూ కోల్ట్స్ స్పందన, హెల్మెట్ వినియోగం, మైనర్ రైడింగ్ ప్రమాదాలు, సైబర్ మోసాలకు గురైతే 1930 కాల్ చేయాల్సిన అవసరం వంటి విషయాలు వివరించారు. బ్యాంకులు ఎప్పుడూ ఓటీపీ అడగవని ప్రజలకు స్పష్టం చేశారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ రూరల్ ఎ.ఎస్సై రఘునాథం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్ ఎస్ఐ కేశవరావు, కళాబృందం సభ్యులు రాధమ్మ, రామాంజనేయులు, షీ టీమ్ కానిస్టేబుల్ యశ్వంత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ సదస్సులో పాల్గొన్న డా. భీంపల్లి శ్రీకాంత్



**పాలమూరు సూర్య న్యూస్:** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నిర్వహణలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియురూసాఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం 'తెలంగాణ పదసాహిత్యం – సమాలోచన ' అనే అంశం పై జరిగిన జాతీయ సదస్సులో జిల్లాకు చెందిన ప్రముఖ పరిశోధకులు, కవి, రచయిత డా.భీంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సదస్సులో భీంపల్లి శ్రీకాంత్ "ఉమ్మడి పాలమూరు జిల్లా పదసాహిత్యం " అనే అంశంపై పత్రసమర్పణ చేశారు. ఈ సందర్భంగా భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ పాలమూరు జిల్లా సంకీర్తన సాహిత్యానికి పాదులు వేసిందన్నారు. పాలమూరు జిల్లాలో ఉన్నంత సంకీర్తనకవులు ఏ జిల్లాలో లేరన్నారు. ఆయనను శాలువా, ప్రశంసాపత్రం, నగదు పురస్కారంతో నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.కాశీం, తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకరశర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎస్.రఘు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డా. ఏలే విజయలక్ష్మి, తెలంగాణ విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డా. కె.లావణ్య, ఢిల్లీ విశ్వవిద్యాలయం ఎస్వీ కళాశాల తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.అట్టెం దత్తయ్య పాల్గొన్నారు.

## తుది దశకి చేరుకున్న ధాన్యం కొనుగోళ్లు



**మహబూబ్ నగర్, సూర్య ప్రతినిధి:** ధాన్యం సేకరణ వేగవంతం చేసి పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఖరీఫ్ 2025%-%26 ధాన్యం సేకరణపై మంగళవారం పౌర సరఫరాల శాఖ అధికారులతో రెవిన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, మొత్తం సేకరణ ప్రక్రియను అత్యంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లర్ల నుండి పొందిన బ్యాంక్ గ్యారంటీలను పరిశీలించగా, మిల్లర్లకు అందజేసిన పాడికి సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ గ్యారంటీలను మూడు (03) రోజుల్లో ఖచ్చితంగా సేకరించాలని సంబంధిత పౌర సరఫరాల శాఖ డి.టి.లను ఆదేశించారు. అదేవిధంగా రబీ 2024%-%25 సీజన్‌కు సంబంధించిన సి. ఎం.ఆర్ డెలివరీ పై సమీక్ష నిర్వహించారు. మిల్లింగ్ సామర్థ్యానికి అనుగుణంగా మిల్లులను రెండు (02) షిఫ్టుల్లో నిర్వహిస్తూ సి. ఎం.ఆర్ డెలివరీ లను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. డిసెంబర్ 29 నాటికి జిల్లాలో 26,015 మంది రైతుల నుంచి మొత్తం 1,30,459 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. మొత్తం ?312 కోట్ల మద్దతు ధర కు గాను, 24,072 మంది రైతులకు ?295 కోట్లు చెల్లించగా, మిగిలిన ?17 కోట్లు రెండు (02) రోజుల్లో విడుదల చేయబడతాయని అధికారులు వివరించారు. బోనస్ మొత్తానికి సంబంధించి, మొత్తం 36.24 కోట్ల రూ.లకు గాను, 7,971 మంది రైతులకు 21.95 కోట్లు రూ.లు చెల్లించబడినట్లు తెలిపారు. మిగిలిన 14.29 కోట్ల రూ.లు ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుండగా, అందుకు సంబంధించిన అన్ని వివరాలు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేయబడినట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణ ,సి.ఎం.ఆర్ డెలివరీ ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.సమావేశం లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్,పౌర సరఫరాల శాఖ డి.ఎం. రవి నాయక్,పౌర సరఫరాల డి.టి.లు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ బి ఎం సంతోష్

**గద్వాల సూర్య ప్రతినిధి :** అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ప్రభుత్వం అందించే ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పాఠశాలల విద్యార్థులకు అందించే ప్రీమెట్రిక్ స్కాలర్షిప్ అంశంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఐదవ తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో పాటు 9, 10 వ తరగతులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కూడా ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో ఎస్సీ విద్యార్థులు 2617 మంది దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండగా ప్రస్తుతం 1196 మంది, 1819 మంది బీసీ విద్యార్థులకు గాను 859 మంది మాత్రమే ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అర్హులైన విద్యార్థులందరూ ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేలా సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన రెవెన్యూ అధికారులు ఇచ్చేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. ఆయా మండలాల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడినీ నోడల్ అధికారిగా నియమించి విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేలా బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు బ్యాంకు లేదా పోస్టల్ ఖాతాలు త్వరితగతిన పొందేలా సంబంధిత అధికారులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని సుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, ఆయా మండలాల విద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సర్టిఫికెట్స్‌ను అన్లైన్ ద్వారా సులువుగా పొందవచ్చు - వీసీజిఎన్ శ్రీనివాస్

### - పియులో ఇన్లైన్ ప్లాట్ఫార్మ్ ఏర్పాటు



**మహబూబ్ నగర్ పియు సూర్య న్యూస్ :** పాలమూరు విశ్వవిద్యాలయం సమగ్రంగా అనుసంధానమైన ఆన్‌లైన్ అకాడమిక్ మరియు పరీక్షా సేవల వ్యవస్థను విజయవంతంగా అమలు చేయడం ద్వారా డిజిటల్ పరిపాలనను బలోపేతం చేస్తూ మంగళవారం ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్ ను ప్రారంభించారు.విద్యార్థి కేంద్రిత సేవలలో కీలకమైన ముందడుగు వేసింది. ఈ వ్యవస్థ ద్వారా విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల పరిధిలో అకాడమిక్ మరియు పరీక్షల నిర్వహణ మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మారనుంది.కొత్త ఆన్‌లైన్ సేవలలో ఎలక్ట్రానిక్ డేటా ప్రాసెసింగ్ ,డేటా రివ్యూ, డేటా మైగ్రేషన్, సర్టిఫికెట్లకు ఆన్‌లైన్ దరఖాస్తు ,మరియు ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ వంటి కీలక అంశాలు ఉన్నాయి. వీటి ద్వారా అకాడమిక్ పరిపాలన సరళీకృతమై, డేటా ఖచ్చితత్వం మెరుగుపడి, పరీక్షా ప్రక్రియల్లో పారదర్శకత సాధ్యమవుతుంది. ఈ డిజిటల్ వ్యవస్థ అమలుతో విద్యార్థులు ఇకపై కన్వొకేషన్, మైగ్రేషన్, కన్సాలిడేటెడ్ మెమోరాండం ఆఫ్ మార్క్స్, ప్రొవిజనల్ సర్టిఫికెట్ తదితర ముఖ్యమైన అకాడమిక్ సర్టిఫికెట్లకు ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అదనంగా పేరు మార్పు దరఖాస్తులు, జెన్యూన్‌నెస్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, అలాగే పూర్తి స్థాయి పరీక్షా సంబంధిత సేవలు సురక్షిత ఆన్‌లైన్ చెల్లింపు విధానం మరియు రియల్ టైమ్ అప్లికేషన్ ట్రాకింగ్తో అందుబాటులో ఉన్నాయి.విద్యార్థుల డేటా నిర్వహణ, పరీక్షల షెడ్యూలింగ్, హాల్‌టికెట్ల జారీ, మార్కుల ప్రాసెసింగ్, ఫలితాల సిద్ధీకరణ, నివేదికల తయారీ వంటి అన్ని దశలను ఈ వ్యవస్థ పూర్తిగా ఆటోమేషన్ చేయడం ద్వారా మాన్యువల్ జోక్యం గణనీయంగా తగ్గింది. ఆధునిక వాలిడేషన్ విధానాలు, ఆడిట్ ట్రైల్స్, మరియు పాత్ర ఆధారిత యాక్సెస్ నియంత్రణల ద్వారా డేటా భద్రత, సమగ్రత మరియు బాధ్యతాయుత నిర్వహణను నిర్ధారించారు. ఈ ఆన్‌లైన్ సేవల ప్రారంభంతో ప్రక్రియలలో ఆలస్యాలు తగ్గి, ఆపరేషనల్ సామర్థ్యం పెరిగి, వేలాది మంది విద్యార్థులకు వేగవంతమైన, ఖచ్చితమైన మరియు విశ్వసనీయ సేవలు అందుబాటులోకి వస్తాయని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం పాలమూరు విశ్వవిద్యాలయం డిజిటల్ మార్పు, పారదర్శకత మరియు స్పందనాత్మక అకాడమిక్ పరిపాలన దృష్టికోణానికి అనుగుణంగా అమలులోకి తీసుకువచ్చినదిగా వారు పేర్కొన్నారు. ఈ ఆన్‌లైన్ సేవల ప్రారంభ కార్యక్రమం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించబడగా, ప్రొఫెసర్ జి. ఎన్. శ్రీనివాస్ %-% వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ పి. రమేశ్ బాబు %-% రిజిస్ట్రార్, డా. కె. ప్రవీణ %-% పరీక్షల నియంత్రణాధికారి, డా. అనురాధ రెడ్డి %-% అదనపు పరీక్షల నియంత్రణాధికారి, అలాగే కోఆర్డినేటర్లు డా. ఎం. అరుణధతి రెడ్డి, డా. బి. సురేష్, డా. ఈశ్వర్ కుమార్, డా. రవీందర్ రెడ్డి మరియు పరీక్షా విభాగ సిబ్బంది పాల్గొన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం అకాడమిక్ పరిపాలనను మరింత బలోపేతం చేయడానికి ఆధునిక డిజిటల్ పరిష్కారాలను నిరంతరం స్వీకరిస్తూ, అన్ని వర్గాల విద్యార్థులకు సమర్థవంతమైన, పారదర్శకమైన మరియు విద్యార్థి అనుకూల సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని తెలియజేసింది.

## తుది దశకి చేరుకున్న ధాన్యం కొనుగోళ్లు

**మహబూబ్ నగర్, సూర్య ప్రతినిధి:** ధాన్యం సేకరణ వేగవంతం చేసి పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఖరీఫ్ 2025%-%26 ధాన్యం సేకరణపై మంగళవారం పౌర సరఫరాల శాఖ అధికారులతో రెవిన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, మొత్తం సేకరణ ప్రక్రియను అత్యంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లర్ల నుండి పొందిన బ్యాంక్ గ్యారంటీలను పరిశీలించగా, మిల్లర్లకు అందజేసిన పాడికి సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ గ్యారంటీలను మూడు (03) రోజుల్లో ఖచ్చితంగా సేకరించాలని సంబంధిత పౌర సరఫరాల శాఖ డి.టి.లను ఆదేశించారు. అదేవిధంగా రబీ 2024%-%25 సీజన్‌కు సంబంధించిన సి. ఎం.ఆర్ డెలివరీ పై సమీక్ష నిర్వహించారు. మిల్లింగ్ సామర్థ్యానికి అనుగుణంగా మిల్లులను రెండు (02) షిఫ్టుల్లో నిర్వహిస్తూ సి. ఎం.ఆర్ డెలివరీ లను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. డిసెంబర్ 29 నాటికి జిల్లాలో 26,015 మంది రైతుల నుంచి మొత్తం 1,30,459 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. మొత్తం ?312 కోట్ల మద్దతు ధర కు గాను, 24,072 మంది రైతులకు ?295 కోట్లు చెల్లించగా, మిగిలిన ?17 కోట్లు రెండు (02) రోజుల్లో విడుదల చేయబడతాయని అధికారులు వివరించారు. బోనస్ మొత్తానికి సంబంధించి, మొత్తం 36.24 కోట్ల రూ.లకు గాను, 7,971 మంది రైతులకు 21.95 కోట్లు రూ.లు చెల్లించబడినట్లు తెలిపారు. మిగిలిన 14.29 కోట్ల రూ.లు ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుండగా, అందుకు సంబంధించిన అన్ని వివరాలు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేయబడినట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణ ,సి.ఎం.ఆర్ డెలివరీ ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.సమావేశం లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్,పౌర సరఫరాల శాఖ డి.ఎం. రవి నాయక్,పౌర సరఫరాల డి.టి.లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తాం

### - టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ వైస్ చైర్మన్ లింగంనాయక్



**మహబూబ్ నగర్, సూర్య ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ లింగంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాపై నమ్మకంతో రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ కు వైస్ చైర్మన్ గా నియామకం చేసినందుకు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే , ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్, రాష్ట్ర ఇన్ చార్జీ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి, టీజీఎంఎఫ్సీ చైర్మన్ కొత్వాల్, ఆల్ ఇండియా ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ విక్రాంత్ భూరియ , వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలుపుతున్న. నేను గతంలో పది జిల్లాలకు ఆదివాసి కాంగ్రెస్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ కోఆర్డినేటర్ గా పనిచేయడం చేయడం జరిగిందన్నారు. రాష్ట ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజన తండాలకు తీసుకెళుతామని అన్నారు. గిరిజన తండాల్లో కాంగ్రెస్ భావాజాలాన్ని తీసుకెళ్లి, పార్టీని పటిష్టం చేసే విధంగా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు ఆనంతరం రాష్ట్ర అదివాసి కాంగ్రెస్ వైస్ చైర్మన్ గా నియమితులైన లింగం నాయక్ ను పార్టీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిది జహీర్ అక్తర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, డీసీసి మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు శేఖర్ నాయక్, ప్రవీణ్ కుమార్, రాములు నాయక్, చందర్ నాయక్, రవి నాయక్, తులసి రామ్ నాయక్, రాము నాయక్, యాదగిరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 2025లో పేట జిల్లాలో శాంతి భద్రతలు భేష్

**- నేరాల నియంత్రణ, శాంతియుత ఎన్నికలు, మహిళలు, బాలికల రక్షణలో జిల్లా పోలీసుల సమర్థత పనితీరు**
**- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేటజిల్లా ప్రతినిధి సూర్యన్యూస్:** నారాయణపేట జిల్లాలో 2025లో శాంతి భద్రతలు,ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఎస్పి డాక్టర్ వినీత్ సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో 2025 సంవత్సర వార్షిక నివేదికను పత్రిక సమావేశం ఏర్పాటు చేసి వివరించారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా కొత్తగ ఫిబ్రవరి 17,2019 న ఏర్పడింది అని జిల్లాలో ఒక సబ్ డివిజన్, నాలుగు సర్కిల్ పోలీస్ స్టేషన్లు, 12 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన శాంతి భద్రతలు, నేరల నియంత్రణ మహిళలు బాలికల భద్రత రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాల నియంత్రణలో సాధించిన ముఖ్యమైన విజయాలను వివరించారు. ఈ సంవత్సరం జిల్లా పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా రోజువారి విధులతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ప్రజలకు నిరంతరం సేవలందించారు అని అన్నారు.గత ఏడాది కన్నా ప్రస్తుత సంవత్సరంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిం దని అందులో హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, మహిళలపై దాడులు, చైన్ స్నాచింగ్ లు మొదలగు నేరాలు తగ్గాయని ఎస్పీ తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు ఏర్పాటుచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిస్పక్షపాతంగా నిర్వహించడం జరిగింది అని తెలిపారు. డిసెంబర్ లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎం సి సి వైలెన్స్ 12, పోల్ వయిలెన్స్ 3, లిక్కర్ సీజ్, లిక్కర్ కేసులు 63, ఇతర కేసులు 2 నమోదు అయ్యాయి జిల్లాలో 4 జాగిలాలు ఉన్నాయి. 1 నార్కోటిక్,స్నైపర్ 1 , ట్రాకర్ కలిగి ఉన్నాయి. డాగ్ స్క్వాడ్ ను 224 తనిఖీలకు ఉపయోగించాం. లోక్ అదాలత్ ద్వారా 849 ఎఫ్ ఐ ఆర్ కేసులు,9511 ఈ పెట్టి కేసులు, 2490 డి డి కేసులు నమోదు చేయడం జరిగిందని,సైబర్ క్రైమ్ లకి సంబంధించి 368 ఫిర్యాదులలో 165 కేసులు పరిష్కరించాం అని, ఈ కేసులలో 43,74,618 రూపాయలకు గాను కోర్టు ఆదేశాల ద్వారా 20,40,000 రూపాయలు రికవరీ చేశాం అని అన్నారు. డయల్ 100 జిల్లా పరిధిలో 11,124 కాల్స్ వచ్చాయని, బ్లూ కోట్స్ పోలీసులు 24ి7 ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజలకు సత్వర సేవలందిం చడం జరిగిందని తెలిపారు. 2024 -2025 కి గాను మొత్తం రిపోర్టెడ్ కేసులు 10.5 శాతం పెరిగింది అని (గ్రేవ్) తీవ్రమైన నేరాలు 22శాతం తగ్గాయన్నారు. కిడ్నప్ కేసులు 4శాతం పెరిగాయి. రేప్,పోక్సో మహిళా పై జరిగే నేరాలు 12.5 శాతం తగ్గిందని. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ 4శాతం తగ్గిందని,చైల్డ్ మ్యారేజ్ 40శాతం తగ్గిందని వివరించారు.సి ఇ ఐ అర్ అప్లికేషన్ ద్వారా పోలీస్ టీమ్స్ ట్రాక్ చేసి 236 మొబైల్,వాటి విలువ 35.34 లక్షలు రికవరీ చేసి ఇవ్వడం జరిగింది తెలిపారు. మర్డర్,కల్పబుల్ హోమిసైడ్,అటెంటు మర్డర్, రేప్ అండ్ పోక్సో, గ్రీవెస్ హర్ట్,సింపుల్ హర్ట్ కేసుల బాగా తగ్గాయి. గంజాయి కి సంబంధించి 20 మంది పై కేసులు నమోదు చేసి 12.675 కిలోలు సీజ్ చేశాం. అక్రమ మద్యం కేసులో 147 నమోదు కాగా,1526.57 లిటర్ల లిక్కరు స్వాధీనం చేసుకోవడం జరిగింది. గేమింగ్,జూదం యాక్ట్ లో 36 కేసులకు 221 మంది పై కేసు నమోదు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం 1ట్రాఫిక్ ఎస్ఐ, 17 పోలీస్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ నియంత్రణ,బద్దీకరిస్తూ, రోడ్డు ప్రమాదాల అభిమానులకు చర్యలు తీసుకుంటూ, ట్రాఫిక్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువవుతూ ప్రత్యక్షంగా వారి సమస్యలు తెలుసుకోవడానికి ఈ సం. నిర్వహించడం జరిగిందని ఇది నిరంతరం కొనసాగుతుందని, ఇప్పటి వరకు 2 సార్లు నిర్వహించగా 31 మంది కాల్ చేసి సమస్యలు తెలియజేయాగ పరిష్కరించాం అని అన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండడం జరుగుతుందని, జిల్లాలో ముఖ్యమైన పండుగలు జాతరలు, విఐపి వీఐపీ పర్యటనలు ఇలాంటి చిన్న అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించడం జరిగిందని తెలిపారు.


## విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో

పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్‌నగర్ జిల్లా : హన్వాడ, భూత్పూర్, కౌకుంట్ల, రాజాపూర్, మిడ్జిల్, మూసాపేట, దేవరకద్ర రూరల్

వనపర్తి జిల్లా : వనపర్తి రూరల్, పాన్‌గల్, ఖిల్లఘణపురం

నాగర్‌కర్నూల్ జిల్లా : బల్మూర్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, తాడూరు, తిమ్మాజిపేట,

జోగులాంబగద్వాల జిల్లా : ఎర్రవల్లి, వడ్డేపల్లి, మానోపాడు

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు

8008622757





## పగిలిపోయిన తాగు నీటి పైపుల మరమ్మతు



**కోడేరు, సూర్య న్యూస్:** మండల పరిధిలోని తీగల పల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ దేవర పాగ సురేష్ తాగునీటి పైపులకు మరమ్మతులు చేయించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తాగునీటి పైపులు నాలుగు చోట్ల పగిలిపోవడంతో తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో సర్పంచ్ దృష్టికి తీసుకురాగా సర్పంచ్ దేవరపాగ సురేష్ వెంటనే స్పందించి పగిలిపోయిన నాలుగు పైపులను మరమ్మతు చేయించి తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని ఆయన తెలిపారు.




## గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల్ సూర్య ప్రతినిధి:** గురుకులాల్లో పాఠశాలలో 5వ తరగతి నుండి 9వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల గద్వాల్ ప్రిన్సిపాల్ కె రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో 2026-2027 సంవత్సరానికి ఇంగ్లీష్ మీడియంలో 5 వతరగతిలో ప్రవేశాలకు మరియు 6నుండి 9 వతరగతి వరకు మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2025 డిసెంబర్ 21 నుండి 2026 జనవరి 21 వరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీనికి సంబందించిన ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 22 న ఉదయం 11 నుండి 1 వరకు ఉంటుంది. గురుకులాల లో విద్యతో పాటు మంచి లైబ్రరీ సదుపాయం, కంప్యూటర్ విద్య, క్రీడలు పాటు ఉచితంగా ఫుడ్, పుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులు, షూస్ ప్రభుత్వమే కల్పిస్తుంది అని ప్రిన్సిపాల్ కె.రాజు తెలియజేసారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, కులం, ఆదాయం ధ్రువపత్రా లను, పాస్ ఫొటో విద్యార్థి సంతకం ను మీ సేవ కేంద్రంలో ఇచ్చి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలియచేసా రు.







